Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 04.09.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 14 పేజీలు : 12, వెల : ₹ 5




Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE SUPER SPECIALITY DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees



# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com


# ముందు ధనం... తర్వాతే జనం!



- రాష్ట్రంలో కనిపించని పాలన
- నిమిత్తమాత్రులుగా మంత్రులు
- ప్రభుత్వాన్ని శాసిస్తున్న కార్పొరేట్‌లు
- వ్యాపారం తప్ప ఇంకేమీ లేదు

*ఏదో ఒక విధంగా రాహుల్‌గాంధీని ప్రధానిని చేయాలని 2013లో ఆంధ్రప్రదేశ్ విభజనకు పూనుకుంది సోనియా. తెలంగాణలో టిఆర్‌ఎస్‌తో జతకట్టి, ఏపిలో వైకాపాతో ఇంటర్ కనెక్షన్ పెట్టుకుని మొత్తం సీట్లను కొట్టేయొచ్చనుకుంది. ఆమె దుర్మార్గపు ఆలోచనలను దేవుడు పసిగట్టాడేమో కుక్క కాటుకు చెప్పుదెబ్బ అన్న రీతిలో 2014ఎన్నికల్లో ఓటర్ల చేత సమాధానం చెప్పించాడు. తెలంగాణలో అధికారాన్ని మిస్ అయిన కాంగ్రెస్ ఏపిలో పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. సోనియా ఈ పాపపు పని జోలికి పోకుండా వుంటే, రాష్ట్ర విభజన లేకుండా వుంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు వైయస్సార్ కాంగ్రెస్, కాంగ్రెస్‌పార్టీల సంయుక్త ప్రభుత్వం రాజ్యమేలుతుండేదేమో. సోనియా పాపాలకు ఈరోజు ఏపి ప్రజలు శాపగ్రస్తులయ్యారు. ఆమె కుళ్లు కుతంత్రాలతో చేసిన విభజన మూలంగా తెలంగాణకు కేసీఆర్, ఏపికి చంద్రబాబు ముఖ్యమంత్రులు కాగలిగారు. విభజన లేకుంటే 2014ఎన్నికల్లో వీరిద్దరికీ సీఎం ఛాన్సే వుండేది కాదేమో?*

విభజన జరిగితే కొన్ని సమస్యలు ఎదురవుతాయని రాష్ట్ర ప్రజలు భావించారు. అయితే ఇన్ని కష్టాలు ఎదురవుతాయని వూహించలేదు. సమస్యలను తొలగించాల్సిన ప్రభుత్వమే తమను ఇంకా సమస్యల సుడిగుండంలోకి నెడుతుందనుకోలేదు.

రాష్ట్రంలో ప్రభుత్వం వుందా? లేదా? అన్నట్లుగా పరిపాలన వుంది. చంద్రబాబు సర్కార్ ప్రజలకు, ఈ రాష్ట్రానికి ఏవైతే అవసరమో వాటి గురించి ఎంతమాత్రం పట్టించుకోవడం లేదు.

ముఖ్యంగా రాష్ట్రానికి విభజన హామీలు అమలు కావడం లేదు. రాష్ట్రాభివృద్ధికి ప్రత్యేకహోదా ఎంతో అవసరం. ఇది వస్తే గాని రాష్ట్రంలో పారిశ్రామికంగా కదలిక వచ్చే పరిస్థితి కానరావడం లేదు. ఏపికి ప్రత్యేకహోదా వస్తే ఇక్కడ పరిశ్రమలు పెట్ట డానికి ఎంతోమంది పారిశ్రామికవేత్తలు సిద్ధంగా వున్నారు. ఏపికి చెందిన ఎంతోమంది పారిశ్రామికవేత్తలు తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్, బీహార్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ రాష్ట్రాలలో పరిశ్రమలు పెట్టి వున్నారు. ఏపికి ప్రత్యేకహోదా వస్తే అక్కడ నుండి ఏపికి పరిశ్రమలు తరలించడానికి వారంతా సిద్ధంగా వున్నారు. ప్రత్యేకహోదా కోసం చంద్రబాబు వైపు నుండి గట్టి ప్రయత్నమే జరగడం లేదు. విభజన హామీలలో రాష్ట్రానికి ఎన్నో సంస్థలను ప్రకటించారు. అవి అడగడం లేదు. రైల్వేజోన్ చెప్పారు. దాని గురించి పట్టించుకోవడం లేదు. దుగరాజపట్నం ఓడరేవును ప్రకటించారు. దీని ఊసే లేదు. రాష్ట్ర ప్రభుత్వ పరంగా వీటి కోసం ప్రయత్నాలు లేవు. రాష్ట్రంలో వున్న పరిస్థితులను బట్టి చూస్తే చంద్రబాబు పాలసీ ఒకటే లాగుంది. నాలుగేళ్లు సొంత పనులు, సొంత అభివృద్ధి చూసుకుందాం, ఎన్నికలు వచ్చే సంవత్సరంలో పరిపాలన గురించి ఆలోచిద్దాం, కొత్త పథకాలు పెడదాం, (మిగతా 11వ పేజీలో)



## భూసేకరణ నేరం... బాబుది కాదు... నాదే!

### మితిమీరిన నారాయణ స్వామి భక్తి

**కడతారో కట్టరో తెలియని రాజధాని... ఈ శతాబ్దంలో అవుతుందో, ఇంకో శతాబ్దంలో జరుగుతుందో తెలియని రాజధాని... ఈ తరం వారు చూస్తారో లేదో... అసలు ఏ తరం వారు చూస్తారో అర్థంకాని రాజధాని... అమరావతి. దీని పేరుతో రాష్ట్రంలో జరుగుతున్న దారుణం అంతా ఇంతా కాదు.**

రాజధాని పేరుతో గుంటూరు జిల్లాలో 30వేల ఎకరాల భూ సమీకరణ చేసారు. ఇందులో స్వచ్ఛంధంగా ఇచ్చిన రైతులతో పాటు గత్యంతరం లేక ఇచ్చిన రైతులు కూడా ఉన్నారు. ఈ భూ సమీకరణలో ప్రధానపాత్ర మున్సిపల్ మంత్రి పి.నారాయణది. 2014ఎన్నికల్లో ఆయన తెలుగుదేశంకు పెట్టుబడి పెట్టాడు. దానికి రాబడిని రాజధాని భూములలో చూసుకోమని చంద్రబాబు చెప్పినట్లున్నాడు. నారాయణ మంత్రి చేయాల్సిన పనులను వదిలేసి తుళ్లూరులో తహశీల్దార్ పోస్ట్ చేయసాగాడు. (మిగతా 11వ పేజీలో)



## నేతల మధ్య... నలుగుతున్న నగరం

- అయోమయంలో అధికారులు
- ముందుకు సాగని పనులు

చచ్చు ప్రజాస్వామ్యపాలన కన్నా సమర్థవంతమైన నియంతృత్వ పాలనే మేలని కొందరి అభిప్రాయం. కొన్ని సందర్భాల్లో ఇది నిజమేననిపిస్తుంది. 2004 నుండి 2014 వరకు నెల్లూరు నగరపాలక సంస్థలో ఆనం వివేకానందరెడ్డి నియంతృత్వ రాజ్యం నడిచింది. కార్పొరేషన్ పరిధిలో ఆయన ఆడిందే ఆట, పాడిందే పాట. మేయర్‌లైనా, కమిషనర్‌లైనా ఆయన కనుసన్నల్లో పని చేసినవాళ్లే. కనుసైగలతో కదిలిన వాళ్లే! ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన పాలకవర్గాన్ని నిర్వీర్యం చేసి కార్పొరేషన్‌పై వివేకా బోడిపెత్తనమేంటని ఆరోజు బాగానే విమర్శించారు. ఎమ్మెల్యేకు కార్పొరేషన్ వ్యవహారాలతో ఏం పనని ప్రశ్నించిన వాళ్లు కూడా వున్నారు. కార్పొరేషన్‌పై వివేకా ఏకచత్రాధిపత్యం ఆరోజు చాలా మందికి తప్పనిపించింది. (మిగతా 11వ పేజీలో)




కళాభినందనలు
కళలకు కాణాచి మన సింహపురిలో
కళల వేదికగా కళాకారులకు కానుకగా
పురమందిరాన్ని(టౌన్‌హాలు) అందంగా తీర్చిదిద్దిన
కళాప్రియులు, కళారాధకులు
జె.యస్.రెడ్డి గారు
డా॥ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు స్వీకరిస్తున్న
శుభసమయంలో మా కళాభినందనలు.

'కళాంజలి' అనంత్
మరియు సింహపురి కళాకారులు

# సేవలకు సత్కారం... ప్రతిష్ఠాత్మక పురస్కారం


## 6న డా॥ జె.యస్.రెడ్డికి బెజవాడ గోపాలరెడ్డి అవార్డు ప్రదానం

*ఓ వ్యక్తి తన జీవిత పోరాటంలో వేల కోట్ల ధనం సంపాదించి ఉండొచ్చు, మేడలు, మిద్దెలు కట్టి వుండొచ్చు. పెద్ద సంఖ్యలో బంధుమిత్రులను సంపాదించుకొని వుండొచ్చు. అయితే అవేవీ మన వెంట రావు. అవేవీ మనిషికి సంతృప్తిని కూడా ఇవ్వవు. జీవితకాలంలో మన మంచితనమే మన వెన్నంటి శాశ్వతంగా ఉంటుంది. మనం తనువు చాలించాక కూడా మనం మిగుల్చుకున్న కీర్తే ఈ భూమిపై శాశ్వతంగా నిలిచివుంటుంది. డబ్బు, హోదా, పలుకుబడి... ఇవేవీ మనిషికి ఆనందాన్నివ్వలేవు. ఈ సమాజానికి మనమేం చేశాం? మన వల్ల ఎన్ని కుటుంబాలు బాగుపడ్డాయి, ఎంతమంది సంతోషంగా బ్రతుకు గలుగుతున్నారు అన్న ప్రశ్నలు మనకు మనమే సంధించుకున్నప్పుడు, దానికి సరైన సమాధానం దొరికితే జీవితానికి అంతకుమించిన అర్థం, పరమార్థం ఇంకేమీ వుండదు. ఈ ప్రశ్నలన్నింటికీ ఓ సమాధానం జక్కా శ్రీనివాసులురెడ్డి. అందరి మనసుల్లో జె.యస్.రెడ్డి.*

నిజమే, ఆయన వల్ల ఎందరికో మంచి జరిగింది. సమాజానికి మేలు కలిగింది. పదిమంది బ్రతుకుతున్నారు. నలుగురికి మంచి చేసినోడే కాని చెడు చేసినవాడు కాదు. ఈరోజే కాదు రేపు కూడా... మన తర్వాత తరం వారు కూడా జె.యస్.రెడ్డి గురించి మంచిగానే చెప్పుకుంటారు. ఎందుకంటే వేలమంది క్యాన్సర్ రోగులకు సేవలందిస్తున్న నెల్లూరులోని రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిని చూస్తే జె.యస్.రెడ్డి గుర్తుకు వస్తాడు.

నెల్లూరులోని చిన్నారులందరికీ ఆహ్లాద ప్రపంచంగా వున్న చిల్డ్రన్స్ పార్కును చూస్తే జె.యస్.రెడ్డే మనసులోకి వస్తాడు. నెల్లూరులో కళా, నాటక, సాహితీప్రియులకు ఏకైక వేదిక పుర మందిరం. పాడుబడిన ఈ పురమందిరాన్ని ఆధునికంగా తీర్చిదిద్దిన దాత జె.యస్.రెడ్డి. జిల్లాలోని కళాకారులంతా కూడా జె.యస్.రెడ్డి పేరును ఇప్పుడిప్పుడే మరచిపోలేరు. నెల్లూరులో టౌన్‌హాల్ వున్నంత వరకు, చిల్డ్రన్స్ పార్కు చెక్కు చెదరనంతవరకు, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి రోగులకు సేవలందిస్తున్నంత వరకు జె.యస్.రెడ్డి పేరు చరిత్ర పుటల్లో నిలిచే వుంటుంది.

అవార్డులు అలంకారప్రాయం కాదు. అవార్డు ఏ పేరుతో అయితే ఇస్తున్నారో ఆ వ్యక్తికి ఒక చరిత్ర వుండాలి. ఆ అవార్డును తీసుకునే వ్యక్తికి కూడా అందుకు తగ్గ అర్హత ఉండాలి. నెల్లూరు జిల్లాలో అత్యంత ప్రతిష్ఠాత్మకమైన పురస్కారం డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డు. ఈ పేరు వినగానే ఆయన గొప్పతనాన్ని గురించి ప్రత్యేకంగా ప్రస్తావించాల్సిన పనిలేదు. ఎందుకంటే ఆయన గొప్పతనాన్ని గురించి పుస్తకాలే వచ్చాయి. ఒక పేజీలో ఎంతని వ్రాయగలం. ఆయన పేరుతో ఇస్తున్న అవార్డును ఈ నెల 6వ తేదీన జె.యస్.రెడ్డి స్వీకరిస్తున్నారు. ఈ అవార్డును స్వీకరించడానికి అన్ని విధాలా అర్హుడు జె.యస్.రెడ్డి. గతంలో బెగోరె అవార్డును కట్టమంచి రామ్మోహన్‌రెడ్డి, మంగళంపల్లి బాలమురళీకృష్ణ, డాక్టర్ సిఎంకెరెడ్డి, డాక్టర్ యం.యస్.రెడ్డి, ఎస్.పి.బాలసుబ్రహ్మణ్యం, అక్కినేని నాగేశ్వరరావు, ఆర్.ఏ. పద్మనాభరావు, కె.ఐ.వరప్రసాద్‌రెడ్డి, పి.సుశీల, టి.సుబ్బరామిరెడ్డి, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ఉండేల మాలకొండారెడ్డి,



వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, యం.వెంకయ్యనాయుడు, వి.ఎల్.ఇందిరాదత్, డాక్టర్ కొణిజేటి రోశయ్య, పద్మశ్రీ శాంతసిన్హా, డాక్టర్ మంచు మోహన్‌బాబులు అందుకుని వున్నారు. వివిధ రంగాలలో వీరు అగ్రగణ్యులు. కాబట్టి ఈ అవార్డు ఎంత ప్రతిష్ఠాత్మకమైందో వీరిని బట్టే నిర్ణయించవచ్చు. ఈ అగ్రగణ్యుల సరసన ఇప్పుడు జె.యస్.రెడ్డి కూడా చేరుతున్నారు.

జె.యస్.రెడ్డి అదృష్టం కలిసొచ్చి ఒక్క రోజులోనో, ఒక్క నెలలోనో గొప్ప వ్యక్తి కాలేదు. అతని ఎదుగుదల వెనుక కష్టం వుంది. పట్టుదల వుంది. చిత్తశుద్ధి, అంకితభావం వున్నాయి. ఇందుకూరుపేట మండలం జగదేవిపేట స్వగ్రామం. జక్కా రంగారెడ్డి-కామేశ్వరమ్మలకు మూడో సంతానం. 1945 మార్చి 8వ తేదీన వ్యవసాయ కుటుంబంలో జన్మిం చాడు. విద్యాభ్యాసం నెల్లూరులో జరిగింది. తిరుపతిలోని వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అగ్రికల్చర్ బిఎస్సీ పూర్తి చేసారు. తన మేనమామ గునుపాటి హరిశ్చంద్రారెడ్డి ప్రోత్సాహంతో కాంట్రాక్ట్ రంగంలోకి దిగి అంచెలంచెలుగా ఎదిగాడు.

### బెంగుళూరులో నివాసం జిల్లాతో సావాసం

కాంట్రాక్టర్‌గా ప్రాచుర్యాన్ని పొంది ఆర్థికంగా బలపడి బెంగుళూరులో స్థిరపడిపోయాడు. ఓ వైపు అపారమైన పలుకుబడి కలిగిన వ్యక్తిగా, మరోవైపు మంచి స్నేహశీలిగా బెంగుళూరులో ఎందరో ఆత్మీయుల మన్ననలను అందుకుంటూ ఇందిరానగర్‌లోని ఇందిరానగర్ క్లబ్‌కు అపారకీర్తిని తీసుకురావడంలో విశేష కృషి జరిపాడు. కర్నాటకలోని రాజకీయ వర్గాల్లోనూ, వ్యాపారవేత్తలలోనూ అధికార అనధికార ప్రముఖులతోను మంచి మిత్రుడిగా గుర్తింపు పొందాడు. అయితే తన సొంత జిల్లాని మరువలేదు. నివాసం అక్కడైనా సావాసం జిల్లాతోనే చేశాడు.

తాను ఎంతో మక్కువ చూపే వ్యవసాయ రంగానికి ప్రాధాన్యత ఇస్తూ 1994-95 ప్రాంతంలో నెల్లూరుజిల్లాలో పామాయిల్ సాగును ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా పామాయిల్ సాగును ప్రోత్సహించి రైతన్నలను లాభాలబాటలో నడిపించారు. తర్వాతి కాలంలో మనుబోలు వద్ద 'సింహపురి ఆగ్రోప్రోడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో పామాయిల్ ఫ్యాక్టరీని స్థాపించారు. ఈరోజుకీ జిల్లాలో పామాయిల్ సాగు అంటే ముందుగా గుర్తొచ్చేది జె.యస్.రెడ్డే! ఇక నెల్లూరులో క్యాన్సర్ ఆసుపత్రి, టౌన్‌హాల్ పునరుద్ధరణ, చిన్నపిల్లల పార్కు నిర్మాణమే కాక స్వగ్రామంలో తమ తల్లి కామేశ్వరమ్మ పేరిట ఆసుపత్రిని నెలకొల్పారు. అంతరించిపోతున్న పద్యనాటక రంగాన్ని ప్రోత్సహించడానికి తమ తండ్రి పేరుతో జక్కా రంగారెడ్డి స్మారక కళాపీఠంను ఏర్పాటు చేసి ప్రతియేటా రాష్ట్ర స్థాయి పద్యనాటక పోటీలను నిర్వహించారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా నెల్లూరులో జాతీయ స్థాయి టెన్నిస్ పోటీలను నిర్వహించారు. ప్రతిఏటా ఆర్థిక స్థోమత లేక చదువు మానుకోవాలనుకుంటున్న విద్యార్థులను గుర్తించి, వారికి ఆర్థిక చేయూతనిస్తూ విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్న గొప్ప వ్యక్తి జె.యస్.రెడ్డి. ఆయన తన కుటుంబాన్ని ఎంతగా ప్రేమిస్తాడో, సమాజాన్ని అంతగా అభిమానిస్తాడు. కాబట్టే ఇన్ని సమాజహితం పనులు చేయగలిగాడు.

జె.యస్.రెడ్డి ఎదుగుదలలో కొండంత అండగా నిలిచిన కుటుంబసభ్యులను కూడా ఈ సందర్భంగా అభినందించాలి. పెద్దన్నయ్య స్వర్గీయ జక్కా రాధాకృష్ణారెడ్డి, రెండో అన్న మాజీశాసనసభ్యులు జె.కె.రెడ్డి, తమ్ముడు జక్కా శివనారాయణరెడ్డిలు జె.యస్.రెడ్డి కష్టసుఖాల్లో ఎప్పుడూ తోడునీడగా నిలిచేవాళ్లు. ఇక జె.యస్.రెడ్డిలో సగం కీర్తి ఆయన సతీమణి సౌదామినమ్మదే! ఇల్లాలే ఇంటి దేవత అనడానికి అక్షర రూపం ఆ మహాతల్లి. జె.యస్.రెడ్డి ఇంత ప్రతిష్ఠాత్మకమైన అవార్డును అందుకునే శుభసమయంలో ఈ లోకంలో ఆమె లేకపోవడం పెద్దలోటే! అయినా దివి నుండి ఆమె తన భర్త డాక్టర్ బెగోరె అవార్డును అందుకునే శుభసన్నివేశాన్ని చూసి ఆనందిస్తుంది. ఒక మహోన్నత వ్యక్తి పేరుతో నెలకొల్పిన అవార్డును ఒక సేవాస్ఫూర్తిగా పేరుగాంచిన జె.యస్.రెడ్డి అందుకుంటున్న సందర్భంగా ఆయనకు 'లాయర్' అభినందనలు.

# రెడ్‌క్రాస్ సంఘ ఎన్నికలకు చర్యలు చేపట్టాలి



రెడ్‌క్రాస్ సంస్థ కార్యనిర్వాహక సంఘ ఎన్నికలకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఇన్‌ఛార్జి కలెక్టర్ ఎఎండి ఇంతియాజ్ పేర్కొన్నారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో రెడ్‌క్రాస్ కార్యనిర్వాహక సంస్థ ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు సంబంధించిన నియమ నిబంధనలను గురించి సభ్యులకు తెలియజేయాలన్నారు. ఎన్నికల ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, హాస్పిటల్ సూపరింటెండెంట్ డా॥ సుబ్బారావు, రెడ్‌క్రాస్ సంస్థ ప్రతినిధి డా॥ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

# గిడుగు రామ్మూర్తి జయంతి



వ్యవహారిక భాషోద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి 152వ జయంతి వేడుకలు స్ఫూర్తి జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల్లూరు దర్గామిట్ట బాలసదన్ బాలికల వసతి గృహంలో జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా పల్లెపాడు డైట్ విశ్రాంత సీనియర్ ఉపన్యాసకులు పి.యల్.నరశింహారావు, ఇందుకూరుపేట మండలం కొత్తూరు జడ్పీపి హైస్కూలు తెలుగు ఉపాధ్యాయురాలు టి.సుజాతమ్మ, సంస్థ ప్రధానకార్యదర్శి గుండాల నరేంద్రబాబు, ఉపాధ్యాయులు యస్.చంగయ్య, ప్రసన్న పాల్గొని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా నరశింహారావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి తెలుగు భాషను బాగా చదువుకోవాలని, గిడుగు రామ్మూర్తి వ్యవహారిక భాష కోసం, గ్రాంధిక భాషావాదులతో ఉద్యమం చేసారని, దాని ఫలితంగా నేడు పుస్తకాలలో ఉపయోగించే భాష, మాట్లాడే భాష ఒకే విధంగా ఉందన్నారు. సుజాతమ్మ మాట్లాడుతూ తెలుగు భాషను అమ్మలా అభిమానంతో ఆదరించాలన్నారు. అనంతరం సంస్థ ఆధ్వర్యంలో నరశింహారావు, సుజాతమ్మలను శాలువాలతో సంస్థ ప్రధానకార్యదర్శి గుండాల నరేంద్రబాబు సత్కరించారు. కార్యక్రమంలో వసతి గృహ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలధర్మం
# చిర్రారెడ్డి విశ్వనాథరెడ్డి



నెల్లూరు, రమేష్‌రెడ్డినగర్‌లోని ప్రముఖ కీళ్లు, ఎముకల వైద్య నిపుణులు డాక్టర్ సి.ఉమామహేశ్వరరెడ్డి తండ్రి, ఏపిఎస్ఇబి సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన చిర్రారెడ్డి విశ్వనాథరెడ్డి ఆగస్టు 28వ తేదీన తన 84వ యేట తుదిశ్వాస విడిచారు. తిరుపతి సమీపంలోని తొండవాడ ఆయన స్వగ్రామం. ఉద్యోగరీత్యా నెల్లూరుకొచ్చి మూలాపేటలో స్థిరపడ్డారు. ఆయన పెద్దకొడుకు ఉమామహేశ్వరరెడ్డి నెల్లూరులో అందరికీ తెలిసిన డాక్టర్! రెండో కొడుకు డాక్టర్ జగదీశ్వర్‌రెడ్డి అమెరికాలో ఆల్‌టైర్ సంస్థకు ఉపాధ్యక్షులుగా ఉన్నారు. మూడో కుమారుడు బెంగుళూరులో ఐటి విభాగ నిపుణులుగా పనిచేస్తున్నారు. విశ్వనాథరెడ్డి మృతికి సంతాపం ప్రకటిస్తూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# వాకర్స్‌కు వైద్యపరీక్షలు



నెల్లూరు పొదలకూరురోడ్డులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో గత నెల 30న జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో వాకర్స్‌కు ఉచిత బిపి, షుగర్ తదితర పరీక్షలను విశ్రాంత హెడ్‌నర్స్ రాజెమ్మ నిర్వహించారు. సంఘ కార్యదర్శి మండవ శ్రీనివాసరావు, అధ్యక్షుడు చెలంచెర్ల భాస్కరరెడ్డి, మధురకవి బిరదవోలు రామిరెడ్డి, యం.వి.కృష్ణయ్య, పోలయ్య, రమణయ్య, శంకరయ్య, ఆంజనేయులు, రాజు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

# అపోలోలో మెమోరీ క్లినిక్



అపోలో స్పెషాలిటీ ఆసుపత్రిలో మంగళవారం మెమోరీ క్లీనిక్‌ను నెల్లూరుజిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ ప్రారంభించారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ మెమోరీకి సంబంధించిన వ్యాధులపై ప్రజల్లో అవగాహన తక్కువుగా వుందని, అపోలోలో ఈ విభాగాన్ని ప్రారంభించడం మంచి పరిణామమని వారికి అభినందనలు తెలిపారు. ఆసుపత్రి న్యూరాలజీ విభాగం హెడ్ ప్రొఫెసర్ డాక్టర్ బిందుమీనన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ నెలను మతిమరుపు నెలగా వ్యవహరిస్తారని, దీనిని ఆరు సంవత్సరాలుగా నిర్వహిస్తున్నారన్నారు. మతిమరుపు వయస్సుతో వచ్చే వ్యాధి కాదన్నారు. మతిమరుపు బిపి, షుగర్, పొగ తాగేవారిలో ఎక్కువగా ఉంటుందన్నారు. మతిమరుపు వ్యాధికి మందులు లేవని, అయితే మతిమరుపు బాధితులకు అనేక రకాల చికిత్సలు నిర్వహిస్తున్నారన్నారు. జ్ఞాపక శక్తి కోల్పోయి సాధారణ జీవితం చిన్నాభిన్నం అవుతున్న వ్యక్తుల కోసమే ఈ మెమోరీ క్లినిక్‌ను ప్రారంభించినట్లు తెలిపారు. 60సంవత్సరాలుపైన ఎవరికైనా ఇటువంటి సమస్య వుంటే వాళ్లు మెమోరీ క్లిన్‌క్ సందర్శించవచ్చని డాక్టర్ బిందుమీనన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఏసిబి డిఎస్పీగా ప్రభాకర్



నెల్లూరుజిల్లా అవినీతి నిరోధకశాఖ డిఎస్పీగా తోట ప్రభాకర్ నియమితులయ్యారు. ఆయన జిల్లాలోని తోటపల్లిగూడూరు వాసి. 1991 ఎస్సైల బ్యాచ్‌కు చెందిన ఆయన ప్రకాశంజిల్లాలో పని చేశారు. సిఐగా పదోన్నతి పొంది హైదరాబాద్‌లోని ఏసిబి సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సిఐయూ)లో సేవలు అందించారు. డిఎస్పీగా పదోన్నతి పొంది నిఘా విభాగంలో ప్రకాశం, నెల్లూరు, హైదరాబాదులో పని చేశారు. గతనెల 26న హైదరాబాదులో ఇంటలిజెన్స్ డిఎస్పీగా రిలీవ్ అయిన ఆయన గత నెల 29న ఏసిబి కార్యాలయంలో రిపోర్టు చేశారు. గత నెల 31 నుండి నెల్లూరులో బాధ్యతలు చేపట్టారు. పదేళ్ల పాటు ఏసిబిలో పనిచేసిన ప్రభాకర్ సేవాపతకం, ఉత్తమ సేవాపతకం, ఇండియన్ పోలీస్‌మెడల్ అందుకున్నారు.

# షార్ అసోసియేట్ డైరెక్టర్‌గా తూము?

నెల్లూరుజిల్లా శ్రీహరికోటలోని భారత అంతరిక్ష పరిశోధనా కేంద్రం సతీష్‌ధావన్ స్పేస్ సెంటర్(షార్) అసోసియేట్ డైరెక్టర్‌గా తూము సుబ్బారెడ్డిని నియమించారు. ప్రస్తుతం రేంజ్ ఆపరేషన్ డైరెక్టర్‌గా వున్న డాక్టర్ ఎస్వీ సుబ్బారావు సోమవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ నేపథ్యంలో షార్‌లోని విఏఎల్‌ఎఫ్ డిప్యూటి డైరెక్టర్‌గా వున్న తూము సుబ్బారెడ్డిని అసోసియేట్ డైరెక్టర్‌గా నియమించారు. ఆయన ఇప్పటికే విఎల్‌ఎఫ్ డిజిగా, షార్‌లో రూ.364కోట్లతో నిర్మిస్తున్న రెండో వాహక అనుసంధాన భవన నిర్మాణం ప్రాజెక్టు డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లా దర్శి సమీపంలోని మాధవరం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కావలి జవహర్ భారతిలో ఇంటర్, శ్రీ వెంకటేశ్వర యూనివర్శిటీలో బీటెక్ అభ్యసించి, అయిదవ ర్యాంకర్‌గా నిలిచారు.







# పేదోళ్ల మారాజుకు ఘన నివాళులు

దివంగత ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖరరెడ్డి ఆరవ వర్ధంతి సందర్భంగా బుధవారం నెల్లూరుజిల్లా వ్యాప్తంగా ఆయన విగ్రహాలకు వైయస్సార్సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘననివాళులర్పించారు. నెల్లూరు కరెంటాఫీసు సెంటర్‌లోని వైయస్సార్ విగ్రహానికి నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగరాధ్యక్షుడు తాటి వెంకటేశ్వరరావు, కార్పొరేటర్లు బొబ్బల శ్రీనివాసయాదవ్, లక్ష్మీసునంద, ప్రశాంత్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు నగర డిప్యూటి మేయర్ ముక్కాల ద్వారకానాథ్ ఆధ్వర్యంలో నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లోని వై.యస్. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఓబిలి రవిచంద్ర, ఊటుకూరు మాధవయ్య, గోగుల నాగరాజు, ఖలీల్‌అహ్మద్, దేవరకొండ అశోక్, వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

గొల్లకందుకూరు, కొత్తవెల్లంటి, ములుమూడి, పొట్టేపాళెం, దేవరపాళెం, బుజబుజనెల్లూరు, కనుపర్తిపాడు, కలివెలపాళెం, మాదరాజుగూడూరు, పెనుబర్తి, వావిలేటిపాడు, నారాయణరెడ్డిపేట తదితర ప్రాంతాల్లో వైయస్సార్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేసి నివాళులర్పించారు.

కోడూరుపాడు, గుడిపల్లిపాడు, పాతవెల్లంటి, సౌత్‌మోపూరు గ్రామాల్లో వైయస్సార్ విగ్రహాలకు లేబూరు పరమేశ్వరరెడ్డి, కారుదుంప దశరథరామయ్య, కుండా మురళీమోహన్‌రెడ్డి, పల్లంరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాపూరు చంద్రశేఖర్, అన్నవరపు శివయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వైయస్సార్సీపీ ఎస్సీ సెల్ నగరాధ్యక్షుడు తాళ్ళూరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో కొండాయపాళెంలో అన్నదానం చేసారు. రామ్‌నగర్‌లో కొండా పరంధామరెడ్డి సహకారంతో అన్నదానం చేసారు. నెల్లూరు నగరంలోని 22, 23డివిజన్లలో వైయస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. 21, 22వ డివిజన్‌ల ఇన్‌ఛార్జిలు చేజర్ల మహేష్‌బాబు, మొయిళ్ల సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో...** నెల్లూరు కరెంటాఫీసు సెంటర్లోని వైయస్ విగ్రహానికి మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి, మాజీ జడ్పీ ఛైర్మెన్ చెంచలబాబుయాదవ్, కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఆనం చెంచుసుబ్బారెడ్డి, ఆనం రంగమయూర్‌రెడ్డి, బర్నాబాసు, రాజేష్, ముజీర్, ప్రేమ్‌కుమార్, శివ, రమణ తదితరులు నివాళులర్పించారు.

వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి, వెంకటగిరి, రాపూరు ప్రాంతాల్లోని వైయస్సార్ విగ్రహాలకు నెల్లూరు జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



# శ్రీ భువనేశ్వరి అమ్మవారికి బంగారు కిరీటం

నెల్లూరు మూలాపేటలో వేంచేసియున్న శ్రీ భువనేశ్వరి అమ్మవారికి బంగారు కిరీటం, శ్రీ మూల స్థానేశ్వర స్వామి వారికి బంగారు నామాలను కొప్పర్తి రాం మోహన్‌రావు, గోవర్ధన్ అనే భక్తులు గురువారం కానుకగా అందజేశారు. బంగారు కిరీటం, బంగారు నామం కలిపి 650గ్రాములు ఉంది. దీన్ని చెన్నై జిఆర్‌టి షోరూంలో ప్రత్యేకంగా తయారు చేయించామని, వీటి విలువ రూ.20లక్షలు ఉంటుందని దాతలు తెలిపారు. మోహన్‌రావు, గోవర్ధన్ దంపతులకు దేవస్థానం తరఫున వేదపండితులు స్వామివారి శేషవస్త్రాలను బహుకరించారు. దేవస్థానం ఇఓ కె.జనార్ధన్‌రెడ్డి, ఆలయ అర్చకులు భార్గవస్వామి, బాలాజీస్వామి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.




నెల్లూరులో క్యాన్సర్ నిర్ధారణ కేంద్రం ప్రారంభించినా...
ఆదిత్యనగర్‌లో చిల్డ్రన్స్ పార్క్ ఏర్పాటుచేసినా...
ఆర్.ఎల్.రెడ్డి పురమందిరాన్ని సర్వాంగ సుందరంగా పునరుద్ధరించినా...
అతిశయం ఆర్భాటం కనిపించని మహామనిషి

జక్కా శ్రీనివాసులురెడ్డి (జె.యస్. రెడ్డి)

డాక్టర్ బెజవాడ గోపాలరెడ్డి అవార్డుకు ఎంపిక ముదావహం
వారికి మా హార్థిక శుభాకాంక్షలు. – డి.కె. రెడ్డి

PROP LADDER
your trusted property advisor
BENGALURU & HYDERABAD

NAVYA
BUILDERS & DEVELOPERS
Bengaluru

# 'ప్రభా'తం

## తూటా ఆగితేనే మాట

**సరిహద్దుల్లో తరచూ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుండడం, భారత్‌లో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తుండడం, ఉగ్రవాదానికి నారు పోసి, నీరు పోసి పెంచుతోండడం వంటి చర్యలు పాక్ వైఖరిని తేటతెల్లం చేస్తున్నాయి. అవి నానాటికీ శృతిమించి ఆందోళనకు దారితీసేలా వుంటున్నాయి. ఈ నేపథ్యంలో, పరిస్థితులు మరింత జటిలం కాక ముందే ఇరుదేశాలూ సంయమనంతో వ్యవహరించి చర్చలు సాగించడం మంచిది. చర్చల ద్వారా ఎంతటి సమస్యలనైనా పరిష్కరించుకోవచ్చు. అందుకు ఇరుదేశాలూ శక్తివంచన లేకుండా కృషి చేయాల్సివుంది.**

ఉగ్రవాదంపై భారత్‌తో జరగాల్సిన చర్చల్ని అర్ధాంతరంగా రద్దు చేసుకోవడం ద్వారా పాకిస్థాన్ తన దుందుడుకు వైఖరిని మరోసారి చాటుకుంది. ఉగ్రవాదాన్ని తీవ్రంగా ఖండిస్తూ, ప్రపంచంలో ఏ దేశానికి వెళ్ళినా ఉగ్రవాదంపై పోరుకు సమాయత్తం కావాలంటూ భారత ప్రధాని నరేంద్రమోడీ పదేపదే పిలుపునిస్తుండడం, అందుకు ప్రపంచవ్యాప్తంగా మంచి స్పందనలు లభిస్తుండడం అందరికీ తెలిసిందే. అయితే, పాకిస్తాన్‌కు ఇలాంటివి నచ్చడం లేదనే విషయం, తాజాగా చర్చలు రద్దు చేసు కోవడం ద్వారా మరోసారి తేటతెల్లమైనట్లుగానే భావించవచ్చు. ఎందుకంటే, తొలినుంచి పాక్ ఉగ్రవాదానికి ఊతమిస్తూనే వుంది. భారత్‌పై అక్కసుతో ఉగ్రవాదులను రెచ్చగొడుతూనే వుంది. ఎంతో సున్నితమైన సరిహద్దు ప్రాంతాల్లో సైతం అనేకసార్లు కాల్పుల విరమణ ఒప్పందాలను అధిగమించి కాల్పులకు తెగబడుతూ, రెచ్చగొట్టేతనంతో వ్యవహరిస్తూ అంతా తన చిత్తమేనన్నట్లు ప్రవర్తిస్తోంది.

అయితే, కోపతాపాలు మాని, ఇరుదేశాలూ సంయమనంతో, సుహృద్భావ వాతావరణంలో సమస్యలను చర్చించి పరిష్కరించుకోవడమే మంచి మార్గం. ఆ విషయం ఇరుదేశాధీశులకు తెలుసును కనుకనే, ఇటీవల రష్యాలోని ఉఫా నగరంలో మన ప్రధాని నరేంద్రమోడీతో పాక్ ప్రధాని నవాజ్‌షరీఫ్ చర్చలు జరిపినప్పుడు, ఇరుదేశాల మధ్య సాధారణ సంబంధాల పునరుద్దరణ ప్రక్రియను తిరిగి ప్రారంభించాలనే నిర్ణయానికి వచ్చారు. సమస్యలెన్నెన్ని వున్నా ఒద్దికగా కూర్చుని కలిసి చర్చించుకుంటే ఆశించిన మంచి ఫలితాలు వస్తాయని భావించారు. ఆ మేరకు జరగాల్సిన చర్చలకు సంబంధించి ఒక ఖచ్చితమైన అభిప్రాయానికి కూడా వచ్చారు. ఇందులో భాగంగా తొలిదశలో ఆగస్టు 23, 24 తేదీల్లో జరగాల్సిన ఇరుదేశాల జాతీయ భద్రతా సలహాదారుల సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు. అయితే, ఆ చర్చలు చివరిక్షణంలో రద్దు కావడమే విచారకరం. ఇందుకు ప్రధాన కారణం పాక్ సైనిక అధికారుల ఒత్తిడేనన్నది జగద్విదితమే. భారత్‌తో జరిపే ఏ స్థాయి చర్చల్లోనైనా కాశ్మీర్ ప్రధాన అంశంగా వుండి తీరాలంటూ పాక్ జాతీయ భద్రతా సలహాదారు షరతు పెట్టడంతో కథ మళ్ళీ మొదటికే వచ్చినట్లయింది. అయితే, వాస్తవానికి ఈ చర్చల్లో అద్భుతాల్ని ఆశించలేము కానీ, ఈ సందర్భంగా పాక్ దురాగతాలను బయటపెట్టే అవకాశం భారత్‌కు వుండేది. అలా బయటపెట్టినప్పటికీ పాక్ వైఖరిలో మార్పు వుంటుందా అన్నది కూడా సందేహమే. ఏదేమైనప్పటికీ, ఎన్నో ఏళ్ళుగా వున్న సమస్యలను ఇకనైనా ఒక కొలిక్కి తెచ్చుకునేందుకు చర్చలు ఎంతగానో దోహదం చేస్తాయని భావించారు. ఇరుదేశాల మధ్య చర్చలు ఎంతో ముఖ్యమని అటు మాస్కో-బీజింగ్ నాయకత్వాలు కూడా స్పష్టం చేయడంతో, భారత్-పాక్‌లు ఒక అంగీకారానికి వచ్చి చర్చలకు ఉమ్మడి ప్రకటన రూపొందించాయి. ఈ నేపథ్యంలో, జాతీయభద్రతా సలహాదారుల సమావేశాన్ని ఖరారుచేస్తూ జులై 2వ తేదీన ప్రకటన వెలువరించాయి. దాంతోపాటు, బిఎస్ఎఫ్ ప్రతినిధులు, పాక్ రేంజర్ల సమావేశం, సైనిక డైరెక్టర్ జనరల్స్ మధ్య చర్చలు తదితర అంశాలతో ఉమ్మడి ప్రకటన వెలువడింది. ఉగ్రవాదంతో ముడిపడిన అన్ని అంశాలూ చర్చకు వస్తాయని అందులో స్పష్టం చేశారు. అయితే, ఈ ప్రకటనలో లేని కాశ్మీర్ అంశాన్ని జులై 13న పాక్ జాతీయ భద్రతా సలహాదారు సర్తాజ్ అజీజ్ ప్రస్తావిస్తూ, 'ఉగ్రవాదానికి సంబంధించిన అన్ని అంశాలూ...అంటే, అందులో కాశ్మీర్ సమస్య కూడా అంతర్భాగమేనని, ఈ అంశంపై తాము వెనక్కి తగ్గేది లేదని, ఇరుదేశాల సంబంధాలకు ఇది కేంద్రబిందువని అభిప్రాయం వ్యక్తం చేయడంతో, చర్చల ఆశలు మళ్ళీ అడుగంటిపోయాయి. చర్చల సంగతి తర్వాత, చర్చల్లో ఏమి మాట్లాడుకోవాలో, ఏ అంశాలు నిర్దుష్టంగా వుంటాయో తగు స్పష్టత లేకపోవడంతో, ఇరుదేశాలూ తమ అవకాశాలు జారవిడుచుకున్నట్లయింది. చర్చలు జరిగివుంటే, ఇరుదేశాల అభిప్రాయాలు తేటతెల్లమయ్యేవి. అయితే, చర్చలు రద్దయినతర్వాత కూడా పాక్ జాతీయ భద్రతా సలహాదారు మాట్లాడుతూ, ఉగ్రవాదం-కాల్పుల ఉల్లంఘనలకు సంబంధించి భారత్ చెబుతున్నవన్నీ కట్టుకథలేనని వ్యాఖ్యానించడాన్ని బట్టి పాక్ వైఖరి మారేది కాదని అందరికీ స్పష్టమవుతోంది. అయినప్పటికీ, భారత్ మాత్రం పాక్ వైఖరిని బయటపెట్టే అవకాశాలను మాత్రం వదులుకోకూడదని సర్వత్రా భావిస్తున్నారు.

పాక్ తరచూ భారత్‌పై దాడులకు పాల్పడుతుండడం, పదేపదే కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తుండడం, భారత్‌లో అస్థిరతను సృష్టించేందుకు ప్రయత్నిస్తుండడం, ఉగ్రవాదులకు ఊతమిస్తూ భారత్‌పైకి ఉసిగొల్పుతుండడం వంటి చర్యలు శృతిమించి మరింత ఆందోళనకు దారితీసేలా వుంటున్నాయి. ఈ నేపథ్యంలో, ఈ పరిస్థితులను దారిలోకి తీసుకురావాలంటే, సరిహద్దులో పరిమిత యుద్ధానికి భద్రతా దళాలు సిద్ధపడాల్సివుంటుందని భారత్ సైనిక దళాల అధిపతి జనరల్ దల్బీర్‌సింగ్ హెచ్చరించేదాకా వచ్చిందంటే, ఈ పరిస్థితి ఎంతగా ఆందోళనకరంగా మారుతోందో ఊహించవచ్చు. ఏదేమైనా, పాక్‌తో జరిగే చర్చల్లో హురియత్‌కు ఎలాంటి ప్రాధాన్యత ఇవ్వకూడదన్నదే ప్రధాని మోదీ అభిమతం. అసలు, ఉభయ దేశాల చర్చల్లో మూడవ పక్షానికి పాత్ర వుండరాదన్నది భారత్ తొలినుంచి అనుసరిస్తున్న విధానం. సరిగ్గా అందుకనుగుణంగానే ప్రధాని వ్యవహరిస్తున్నారు కూడా.

ఏదేమైనా, ఇరుదేశాలు చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాల్సి వుంది. చర్చలే ఎవరికైనా సర్వశ్రేయో మార్గం. అందుకు సంయమనం ఎంతో ముఖ్యం. సుహృద్భావ వాతావరణంలో, ఇరుదేశాలూ సంయమనంతో చర్చించుకుంటే సమస్యలు అవే దారికి వసాయన్నది అందరి నమ్మకం. ఆ దిశగా ప్రయత్నాలు సాగాలనే కోరుకుందాం!...

## ఇసుక మాఫియాపై చర్యలేవి


**సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి**

ఇసుక మాఫియా ఆగడాలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, రాష్ట్రంలో ఇసుక మాఫియా చెలరేగిపోయి, అధికార యంత్రాంగంపై దాడులకు దిగుతోందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని బీజేపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారపక్షమైన తెలుగుదేశం పార్టీకి భారతీయ జనతాపార్టీ మిత్రపక్షమైనప్పటికీ ప్రజాసమస్యల పరిష్కారంలో తమ పార్టీ రాజీపడబోదన్నారు. ఇసుక రీచ్‌ల నిర్వహణను ప్రభుత్వం పొదుపు మహిళలకిస్తే, వారిని బెదిరించి ఇబ్బందులకు గురిచేసి ఒకే బిల్లుపై నాలుగు ట్రిప్పులు తిప్పుతున్న సంఘటనలున్నాయన్నారు. గతంలో ట్రక్కు ఇసుక రూ. 3వేలకు లభిస్తే ఇప్పుడు రూ. 15వేలు అయిందన్నారు. ప్రభుత్వానికి రావలసిన కోట్ల రూపాయల ఆదాయం పక్కదారి పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ నాయకులు మిడతల రమేష్, వేళ్ళపాలెం శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసులుగౌడ్, శ్రీనివాసులు, వంశీధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, మధు, రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు అన్నదానం



నెల్లూరుజిల్లా ముస్లిం యూత్ సేవా కమిటి ఆధ్వర్యంలో కర్ణాటకలో గుల్‌బర్గాషరీఫ్ ఖాజా బందే నవాజ్ గంథ మహోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు కొరడా వీధిలో సోమవారం పేదలకు అన్నదానం చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు ఎస్.కె.ఖలీద్, మున్నా, సమీవుల్లా, మసూద్, ఎజాజ్, ఫజల్, ఇస్సాక్, సుజాత్‌ఖాన్, సుభాని, ముక్తిఇస్మాయిల్, సలీం, శరత్‌పవార్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.




## డిటెన్షన్ పద్ధతి వద్దు

కేంద్రప్రభుత్వ విద్యా సలహా సంఘం మరలా ఉన్నత పాఠశాలలో 8వ తరగతికి క్రింది తరగతుల్లో పాస్/ఫెయిల్ పద్ధతిని ప్రవేశ పెట్టాలని యోచిస్తుంది. అందుకు గాను రాష్ట్ర ప్రభుత్వాలకు తమ అభిప్రాయాలను తెలుపమని సూచించడం జరిగింది. దురదృష్టవశాత్తు ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు సూచనప్రాయంగా తమ సమ్మతిని తెలిపినట్లుగా వార్తాపత్రికల తెలియజేశాయి. అయితే ఇంకా ఈ సమస్యపై విస్తృత చర్చలు జరుగనున్నాయి. గతంలో 1950 నుండి 1970వరకు ఉన్నత పాఠశాలల్లో డిటెన్షన్ పద్ధతి అమలులో వుండేది. దానివల్ల అధిక సంఖ్యలో విద్యార్థులు తమ చదువులకు మధ్యలోనే స్వస్తి చెప్పవలసి వచ్చింది. అంతేగాక మన దేశంలో అక్షరాస్యుల సంఖ్య తీవ్రంగా తగ్గిపోయింది. గతంలో యస్.యస్.యల్.సి.(స్కూల్ ఫైనల్), హెచ్.యస్.ఎం.పి. యస్.యల్.సి(12వ తరగతి)లకు చాలా ఆదరణ, గౌరవం ఉండేది. ఈ పరీక్షల్లో పాస్ అయినవారికి వెంటనే ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చేవి. ఉన్నత చదువులైన యం.బి.బి.యస్, బి.ఇ., డిగ్రీ కోర్సుల ప్రవేశానికి అర్హత ఉండేది. కాని క్రింది తరగతుల్లో డిటెన్షన్ పద్ధతి ఉండేది. 12వ తరగతిలో గ్రూపులో ఏ ఒక్క సబ్జెక్ట్ ఫెయిల్ అయినా మొత్తము 4సబ్జెక్టులను మరలా వ్రాయవలసి వచ్చేది. తత్ఫలితంగా చాలామంది విద్యార్థులు తమ చదువులను 12వ తరగతిలోనే స్వస్తిచెప్పవలసిన పరిస్థితి ఏర్పడుతుండేది. కాబట్టి డిటెన్షన్ పద్ధతి వద్దనే వద్దు.

**ఆర్.ఎస్.నాథ్, నెల్లూరు.**

## ప్రసన్న పునరాలోచించాలి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్ష పదవికి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి రాజీనామా చేయడం సబబు కాదు. ఆయన పునరాలోచించాలి. అవినీతి మచ్చలేని రాజకీయం నల్లపరెడ్డి కుటుంబం సొంతం. ఎందరో నాయకులను తయారు చేసిన కుటుంబం అది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో నల్లపరెడ్డి అభిమానులున్నారు. వైసిపిలో ప్రసన్నకు మంచి భవిష్యత్ వుంది. ఆయన రాజీనామాను ఉపసంహరించుకోవాలి.

**చిరంజీవిరెడ్డి, నెల్లూరు.**

## ఉల్లి పల్లెకు చేదా?

ఆకాశాన్నంటుతున్న ఉల్లి ధరలను అదుపులో పెట్టేందుకు పట్టణాల్లో కిలో 20రూపాయల వంతున రైతుబజార్ల ద్వారా కుటుంబానికి రెండు కిలోల వంతున పంపిణీ చేయిస్తోంది ప్రభుత్వం. గ్రామీణ ప్రాంతాల్లో ఈ విధానం ఎక్కడా అమలు పరచనందువల్ల పల్లెవాసులు నాసిరకం ఉల్లిపాయలను కిలో 50రూపాయల వంతున కొని తినవలసి వస్తోంది. పల్లెలపై చూపుతున్న ఈ వివక్ష గ్రామీణులను మనస్తాపానికి గురిచేస్తూ ప్రభుత్వం అనేక విమర్శలను ఎదుర్కొంటుంది. గ్రామాల్లో రైతుబజార్లు లేకున్నా ప్రతి గ్రామంలోను చౌక దుకాణాలున్నాయి. వాటి ద్వారా కార్డుకు ఒక కిలో వంతున విక్రయింపజేస్తే పల్లెవాసులకు కొంతవరకైనా ఊరట లభిస్తుంది.

**మలిరెడ్డి జయరామరెడ్డి, గుండవోలు.**

## పండ్లు తినడం మానేస్తున్నాం

పండ్లు అందరికీ ఆరోగ్యకర ఆహారం. అయితే వ్యాపారులు రసాయనాలతో వాటిని విషమయం చేస్తున్నారు. మన ప్రభుత్వాలు దీని గురించి పట్టించుకోవు. పండ్లను రసాయనాలతో మాగబెట్టే వ్యాపారులు ఉగ్రవాదుల కన్నా ప్రమాదకారులని ఇటీవల ఒక న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. తోటల్నించి, బంధువులు తమ ఇంటి చెట్ల నుండి తెచ్చే పండ్లను తప్పితే మార్కెట్‌లో పండ్లను కొని తినకూడదని నిర్ణయించుకున్నాం.

**తిక్కవరపు సుకుమార్‌రెడ్డి**

**తిక్కవరపు వెంకటశేషమ్మ**

**కూరపాటి గిరిజకుమారి**

## నవ్వాంగ్లం

తెలుగుదేశం ముద్దుబిడ్డ ఎన్టీ రామారావు గారు స్థాపించిన తెలుగుదేశం పార్టీని తెగులు దేశం పార్టీగా మార్చింది చాలక, తెలుగు భాషామతల్లికి ద్రోహం తలపెట్టి, తెలుగు మీడియం స్కూళ్లను ఎత్తివేయడం దారుణం. ఇదే జరిగితే రాబోయే రోజుల్లో '30రోజుల్లో తెలుగు భాష' అనే పుస్తకాన్ని కొనుక్కుని తెలుగు నేర్చుకోవాల్సి వస్తుంది తెలుగుభాషాభిమానులు.

**కురుగూరు రంగనాథం, నెల్లూరు.**

# మీ కన్నీళ్లు తుడుస్తా!



వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షులు, ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి ఆగస్టు 28వ తేదీ నెల్లూరొచ్చారు. ప్రత్యేక హోదా కోసం ఆత్మహత్య చేసుకున్న రామిశెట్టి లక్ష్మయ్య ఇంటికెళ్లారు. లక్ష్మయ్య చిత్రపటం వద్ద నివాళులర్పించారు. లక్ష్మయ్య ఇంట్లో టీ తాగారు. ఆయన కుటుంబసభ్యులను ఓదార్చారు. ప్రత్యేకహోదా కోసం లక్ష్మయ్య ఆత్మ బలిదానం చేసారని, ఆయన ఆశయాన్ని సాధించే వరకు పోరాడుతామని ఈ సందర్భంగా జగన్ పేర్కొన్నారు. లక్ష్మయ్య భార్య విజయమ్మను, సోదరి బుజ్జమ్మను ఆయన పరామర్శించి ధైర్యం చెప్పారు. లక్ష్మయ్య కొడుక్కి ఉద్యోగం వచ్చేలా చేస్తానని హామీ ఇచ్చారు. 28వ తేదీ తన పెళ్లి రోజైనప్పటికీ జగన్ దానిని పట్టించుకోకుండా లక్ష్మయ్య కుటుంబాన్ని పరామర్శించడం కోసం నెల్లూరు రావడం విశేషం. జగన్ వెంట ఎంపి మేకపాటి రాజమోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, మేకపాటి గౌతమ్‌రెడ్డి, కె.సంజీవయ్య, పాశం సునీల్‌కుమార్, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, జడ్పీ ఛైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిలు కూడా వున్నారు.



# బీమాతో మహిళలకు ధీమా!

## - కేంద్రమంత్రి వెంకయ్యనాయుడు

మహిళలకు బీమాతో ధీమా కలిగించాలనే ముఖ్య ఉద్దేశ్యంతో సురక్షాబంధన్ ద్వారా ప్రధానమంత్రి సురక్షాబీమాయోజన క్రింద ఉచిత ప్రమాదబీమా కానుకను అందించడం జరుగుతుందని కేంద్ర పట్టణాభివృద్ధి, పార్లమెంటు వ్యవహారాల శాఖామంత్రి ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

సోమవారం నెల్లూరుజిల్లా వెంకటాచలం మండలం స్వర్ణభారత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత ప్రమాదబీమా పంపిణీ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొని మాట్లాడుతూ అన్నలో 'అ' అక్షరం, నాన్నలో 'న్న' అక్షరం కలిపి 'అన్న' అనే పదం ఏర్పడిందని, అన్న చెల్లెలికి, చెల్లెలు అన్నకి చేదోడువాదోడుగా వుండడమే రక్షాబంధన్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. తన జీత భత్యాలు ఇతర అలవెన్సులు కలిపి రూ.32లక్షల వరకు జమ అయివున్నందున అందులో 10లక్షల రూపాయలు ముప్పవరపు ఫౌండేషన్‌కి విరాళంగా ఇవ్వడం జరిగిందన్నారు. అదేవిధంగా మరో 10లక్షల రూపాయలు స్వర్ణభారత్ ట్రస్టుతో కలిపి 20లక్షల రూపాయలు చెల్లించి 10,069మంది మహిళలకు ప్రమాదబీమా పథకానికి సంబంధించి ఒక్కొక్కరికి 201రూపాయలు చొప్పున బ్యాంకులో జమ చేయడం జరిగిందన్నారు. దీని ద్వారా ప్రమాదవశాత్తు ఏదైనా అప్రశుతులు జరిగితే వారి కుటుంబాలకు 2లక్షల మేర బీమా లభిస్తుందన్నారు. జిల్లా కలెక్టర్ యం.జానకి మాట్లాడుతూ జిల్లాలో 7లక్షల75మందికి బ్యాంకు అకౌంట్లు తెరిపించి 100శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు. దేశ స్థాయిలో పదివేల మంది మహిళలకు ఒకేసారి ప్రీమియం చెల్లించి ప్రమాదబీమా సౌకర్యం కలిగించడం ఇదే మొదటిసారి అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# నెల్లూరు... పేరు మార్చాల్సిన పనేంటి?




నెల్లూరు... ఇదేం విదేశీ దురాక్రమణ చక్రవర్తులు పెట్టిన పేరు కాదు. ఆంగ్లేయులు పెట్టిన పేరు అంతకన్నా కాదు. చారిత్రక ప్రాధాన్యం ఉన్న పేరు. ఎన్నో వందల ఏళ్లుగా వున్న పేరు. నెల్లి అంటే తమిళంలో వడ్లు. వరి ఎక్కువుగా పండే ఊరు కాబట్టి నెల్లూరు అని వచ్చింది. తమిళనాడు మన పక్కనే వుంది కాబట్టి ఆ సంస్కృతి కొంత ఇక్కడ ప్రభావం చూపుతుంటుంది.

ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం రాజమండ్రిని రాజమహేంద్రవరంగా నెల్లూరును సింహపురిగా మార్చాలని నిర్ణయించింది. ఇది పెద్దగా అవసరం లేని పని. విదేశీ చక్రవర్తుల పేర్లున్న నగరాలు, పట్టణాలకు మన స్థానికతను చాటే విధంగా పేర్లు మారిస్తే బాగుంటుంది. బ్రిటీషోడు పెట్టిన మద్రాసు పేరును చెన్నైగా మార్చారు. ఇది కరెక్ట్. రాజమహేంద్రవరం నుండే రాజమండ్రి అని వచ్చింది. ఇది బాగా వాడుకలోకి వచ్చేసింది. ఇప్పుడు ఈ పేరు మార్చడంవల్ల అధికారులకు, జనానికి అనవసర ప్రయాస. నెల్లూరు పేరు శుభ్రంగా వుంది. దీనిని 'సింహపురి'గా మార్చాల్సిన పని లేదు. దీనిబదులు జిల్లాకే విక్రమ సింహపురి జిల్లా అని మారిస్తే సరిపోతుంది.



# ఇంకా నాన్చుడేనా?


***తమ నాయకుడు చంద్రబాబుకు పుష్కరాలపై పెట్టిన శ్రద్ధ తమకు పదవులివ్వడంలో లేకుండాపోయిందని జిల్లాలోని తెలుగుతమ్ముళ్ళు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు విజయవాడలో పార్టీ సమావేశాలు ఏర్పాటు చేసుకుని సొంత సర్వేలు చెప్పిన అబద్దాలను చూసి, మన పాలనను ప్రజలు అద్భుతం అని మెచ్చుకుంటున్నారు, ఇప్పుడు ఎన్నికలు పెట్టినా గతంకంటే 30సీట్లు ఎక్కువొస్తాయని దబ్బా కొట్టుకోవచ్చు. కాని ఇప్పుడు ఎన్నికలు పెడితే మొన్న పార్టీ జెండాలు మోసిన సగం మంది కార్యకర్తలు మళ్ళీ ఓట్లేయరు. కార్యకర్తలు అంతగా మండిపోతున్నారు మరి!***

తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర కావస్తుంది. ఇంత వరకు నామినేటెడ్ పదవుల జోలికి పోలేదు. కొన్ని మార్కెటింగ్ కమిటీలను మాత్రం భర్తీ చేసారు. మొదట్లోనే కొందరికన్నా నామినేటెడ్ పదవులిచ్చుంటే త్వరలో ఒక బ్యాచ్ అన్నా పూర్తయ్యేది. నామినేటెడ్ పదవులు అన్నీ అలాగే ఉంచాడు. రేపు, ఎల్లుండి అని ఊరిస్తూ ఇప్పటి దాకా లాక్కొచ్చాడు.

నెల్లూరుజిల్లాలో నామినేటెడ్ పదవులు ఆశిస్తున్న తమ్ముళ్ల లిస్టు భారీగానే వుంది. అప్పటికీ పి.నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, బీద రవిచంద్రలకు ఎమ్మెల్సీలు దక్కాయి. ఏడాదిలో ఒకే జిల్లా నుండి ముగ్గురికి ఎమ్మెల్సీ ఛాన్స్ దక్కడం చెప్పుకోదగ్గ విషయమే. పెద్ద నాయకులకంటే ఇవి వచ్చాయి. మిగతా నాయకుల పరిస్థితేంటి? రాష్ట్ర స్థాయిలో కార్పొరేషన్ ఛైర్మెన్‌లు, డైరక్టర్‌ల పదవులున్నాయి. వివిధ ఆలయ కమిటీలున్నాయి. ఇక నుడా ఛైర్మెన్, ఆర్టీసీ ఛైర్మెన్ వంటి పోస్టులున్నాయి. పదవులు ఆశిస్తున్న నాయకులు చూస్తేనా... ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, డాక్టర్ జడ్.శివప్రసాద్, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి, వేనాటి రామచంద్రారెడ్డి, అనూరాధ, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేశాయిశెట్టి హనుమంతురావు, కిలారి వెంకటస్వామినాయుడు, బల్లి దుర్గాప్రసాద్, పరసారత్నం, బి.జ్యోత్స్నలత, అంచల వాణి, కంభం విజయరామిరెడ్డి... ఇలా చాలామంది నాయకులు 'క్యూ'లో ఉన్నారు.

వీళ్లంతా ఏదో ఒక పదవిస్తే చాలనుకుంటున్న వాళ్లే. కాని చంద్రబాబు పదవుల జోలికే పోకుండా నాన్చుతుండడంతో వీరిలో పదవీ వ్యామోహం క్రమంగా తగ్గిపోతోంది.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు



## కడపకు ఎసిపిఓ

నెల్లూరు నగరపాలక సంస్థలో ఎసిపిఓగా పనిచేస్తున్న శ్రీనివాసులును డిప్యూటేషన్‌పై కడప కార్పొరేషన్‌కు బదిలీ చేశారు. గత ఏడాది నవంబర్‌లో కడప నుండే ఆయన బదిలీపై నెల్లూరొచ్చారు. తిరిగి కడపకే పంపారు.

## ఏపియుడబ్ల్యూజే ఇసి మెంబరుగా జిలానీఖాన్



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ (ఏపియుడబ్ల్యూజె) రాష్ట్ర కార్యవర్గ సభ్యునిగా పి.జిలానీఖాన్ ఎన్నికయ్యారు. విజయవాడలో ఇటీవల జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఇసి మెంబరుగా పి.జిలానీఖాన్‌ను ఎన్నుకున్నారు. ఇతను నెల్లూరుజిల్లా రాపూరు ఆంధ్రభూమి రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు.

## అక్రిడిటేషన్ల గడువు పొడిగింపు

నెల్లూరుజిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులకు 2013, 2014 సంవత్సరాలకు మంజూరు చేసిన అక్రిడిటేషన్స్, బస్‌పాస్‌ల సౌకర్యంను సెప్టెంబర్ నెల 1వ తేదీ నుండి అక్టోబర్ నెల 31వరకు హైదరాబాద్ సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ పొడిగించినట్లు డిపిఆర్‌ఓ యస్.వెంకటేశ్వరరావు తెలిపారు. నెల్లూరు ఏపి యస్‌ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ వారి కార్యాలయంలో అక్టోబర్ 31 వరకు బస్‌పాసులు రెన్యూవల్ చేసుకోవాలని కోరారు.

## పాలకమండళ్లకు దరఖాస్తుల వెల్లువ

జిల్లాలో 2 నుండి 25లక్షల దాకా ఆదాయం వున్న 83ఆలయాల పాలక మండళ్ల ఏర్పాటుకు 834 దరఖాస్తులు అందినట్లు దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ వేగూరు రవీంద్రరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 50వేల నుండి 2లక్షల దాకా ఆదాయం వున్న 110 ఆలయాల పాలక మండళ్ల దరఖాస్తుల స్వీకరణ గడువు గత నెల 27వ తేదీతో ముగిసిందన్నారు.

# నెల్లూరు కబుర్లు

## ఎమ్మెల్యేలంతా అసెంబ్లీలో...

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో జిల్లాలోని 10మంది ఎమ్మెల్యేలతో పాటు ఎమ్మెల్సీలు అందరూ హైదరాబాద్‌లోనే వున్నారు. ముఖ్యంగా జిల్లాలో వైకాపాకు 7మంది ఎమ్మెల్యేలున్నారు. సెప్టెంబర్ 2వతేదీన దివంగత నేత వై.యస్. 6వ వర్ధంతి సందర్భంగా జిల్లాలో జరిగిన కార్యక్రమాలలో ఎమ్మెల్యేలెవరూ పాల్గొనలేకపోయారు. వై.యస్. వర్ధంతి కార్యక్రమాలలో ఎమ్మెల్యేలు లేని లోటు కనిపించింది.

## వెరైటీ విన్నపం

### పిల్ల చేత దోమల వేషాలేయించిన ఆనం బ్రదర్స్



నెల్లూరు కార్పొరేషన్ ముదురు దోమలకు దేశ వ్యాప్తంగా ఎంత మంచిపేరుందో అందరికీ తెలిసిందే! నగరంలో దోమల బెడద ఎంత తీవ్రంగా వుందో తెలియజెప్పడానికి నెల్లూరు నగర కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్ ఆనం చెంచు సుబ్బారెడ్డి, కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డిలు పిల్లల చేత దోమల వేషాలు వేయించి సోమవారం గ్రీవెన్స్‌డేలో వున్న నగర కమిషనర్ పివివిఎస్ మూర్తి వద్దకు తీసుకెళ్లారు. దోమలు కరుస్తుండడం వల్ల రాత్రిళ్లు చదువుకోలేకపోతున్నామని పిల్లలు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. కమిషనర్ వెంటనే స్పందించి కాలువల్లో సిల్టు తీయిస్తామని, ఫాగింగ్ వేసి దోమలను అరికడతామని హామీ ఇచ్చారు.

## శెభాష్... మైథిలి చిన్నారులు



ప్రపంచానికే ఆదర్శవంతమైన గ్రంథం భగవద్గీత. కాని మన పవిత్ర గ్రంథాన్ని మనమే నిర్లక్ష్యం చేస్తున్నాం. భగవద్గీత సారాంశాన్ని భావితరాలకు అందించాలనే సంకల్పంతో చిన్మయమిషన్ వారు ప్రతి యేటా విద్యార్థులకు భగవద్గీత శ్లోకాల పోటీలను నిర్వహిస్తుంటారు. ఈ యేడాది నిర్వహించిన పోటీలలో నెల్లూరు, గాయత్రినగర్‌లోని మైథిలి ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు తమ ప్రావీణ్యం చూపారు. పోటీలకు సంబంధించి 2వ తరగతి స్థాయిలో గౌతమ్‌రెడ్డి, 5వ తరగతి స్థాయిలో వి.విద్యాసాహితి, 6వ తరగతి స్థాయిలో అమృతవర్షిణి, 7వ తరగతి స్థాయిలో సాయి చందన, 8వ తరగతి స్థాయిలో హేమలు ప్రథమ స్థానంలో నిలిచి తమ స్కూల్ పేరు నిలబెట్టారు. విజేతలను మైథిలి స్కూల్ అధినేతలు శ్రీమతి మైథిలి, బి.మనోహర్‌రెడ్డిలు అభినందించారు.


## ఈవ్-టీజర్స్‌ను చీరేస్తాం!





ఈ నెల 1వ తేదీన నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఎస్పీ డాక్టర్ గజరావు భూపాల్ ఆధ్వర్యంలో నేర సమీక్షా సమావేశం జరిగింది. జిల్లాకు సంబంధించిన సబ్‌ఇన్స్‌పెక్టర్ స్థాయి నుండి డిఎస్పీ స్థాయి పోలీసు అధికారుల వరకు అందరూ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గజరావ్ భూపాల్ మాట్లాడుతూ జిల్లాలో పెండింగ్ కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఈవ్-టీజింగ్ మీద ప్రత్యేక దృష్టి సారించి అసలు టీజింగ్ జరక్కుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోలీస్ అధికారులతో ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్ పరిసర ప్రాంతాల్లో వున్న చెత్తను శుభ్రం చేసి స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## యర్రగడ్డల కోసం తపస్సు




ఉల్లి చేసే మేలు తల్లి కూడా చేయదని సామెత. నిత్యావసరాల్లో ప్రముఖమైంది. గతంలో చాలా తక్కువ ధరకు యర్రగడ్డలు లభించేవి. ఏ కూర చేయాలన్నా ఎర్రగడ్డలు తప్పనిసరి. ఎర్రగడ్డ లేకపోతే ఆ కూర రుచీ పచీ వుండదు. ప్రస్తుతం ఎర్రగడ్డల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీనిపై స్పందించిన నెల్లూరుకు చెందిన ప్రముఖ చిత్రకారుడు అమీర్‌జాన్ ఎర్రగడ్డలు కోసం తపస్సు చేయాలన్న విధంగా కార్టూన్ చిత్రించి తన స్పందన తెలియజేశాడు.

## ఉల్లీ... తగ్గవే తల్లీ



నెల్లూరు మూలాపేటకు చెందిన ఉపాధ్యాయుడు, సూక్ష్మ కళాకారుడు గంధవళ్ళ ఉమాశంకర్ ప్రస్తుతం ఉల్లిరేటు అందనంత ఎత్తుకు చేరుకున్న సందర్భంగా తనదైన శైలిలో స్పందించారు. బల్బు లోపల సుద్దతో ఉల్లిపాయ నమూనా, ఉల్లీ... తగ్గవే తల్లీ అనే వేదనతో తల్లడిల్లుతున్న సామాన్య పౌరుని వ్యధను అద్భుతంగా రూపొందించారు. సాధ్యమైనంత త్వరగా ఉల్లిరేటు సామాన్యునికి చేరువగా రావాలని ఉమాశంకర్ ఆకాంక్షించారు.

## 5న శ్రీకృష్ణ గానామృతం

శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదినం సందర్భంగా ఈ నెల 5వ తేదీ శనివారం సాయంత్రం 6.30గంటలకు నెల్లూరు టౌన్‌హాలులో ప్రముఖ సంగీత విద్వాంసురాలు జె.బాలార్క నేతృత్వంలో ఆమె శిష్య బృందంచే "గోవింద కృష్ణ జై... గోపాల కృష్ణ జై..." సంకీర్తనల గానామృతాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సంగీతాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని బాలార్క ఒక ప్రకటనలో కోరారు.

## సోదర భావాన్ని పెంచేదే రాఖీ పౌర్ణమి



ప్రజల్లో సోదరభావాన్ని పెంచేందుకు రక్షాబంధన్ తోడ్పడుతుందని నెల్లూరు వేదాయపాలెం బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు సిస్టర్ బి.కె.ప్రసన్న అన్నారు. ఆగస్టు 28వ తేదీ ప్రెస్‌క్లబ్‌లో జర్నలిస్టులకు రాఖీలు కట్టిన అనంతరం సిస్టర్ ప్రసన్న మాట్లాడుతూ నైతిక విలువలు తగ్గిపోతున్న కాలంలో కులమతాలకు అతీతంగా రాఖీ పౌర్ణమిని జరుపవలసిన అవసరం వుందన్నారు. సోదరులకు సోదరీమణులు కట్టే రాఖీ మనోధైర్యం, మానసిక ఆనందాన్ని కలుగజేస్తుందన్నారు. ప్రతి యేడాది విద్యార్థులకు, అధికారులకు, ప్రముఖులకు, ఖైదీలకు పోలీసులకు బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం తరపున రాఖీలు కడుతున్నామన్నారు. ప్రతియేడాది బ్రహ్మకుమారి ప్రధాన కార్యాలయం మౌంట్‌అబూలో ప్రత్యేక కార్యక్రమాన్ని జర్నలిస్టుల కోసం నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మకుమారీలు శకుంతల, కుమారి లక్ష్మి, ఏపియుడబ్ల్యూజె రాష్ట్ర కార్యదర్శి ఏ.జయప్రకాష్, బ్రహ్మకుమార్ శ్రీనివాస్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రదానం

ఆగస్టు 27వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని నెల్లూరు ఏసి స్టేడియంలో సింహపురి స్పోర్ట్స్ ఫౌండేషన్ వారు క్రీడా ప్రతిభా పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ అధ్యక్షులు, డిప్యూటీ మేయర్ యం.ద్వారకానాథ్ ఎంతో ఆసక్తితో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. గత 4 ఏళ్లుగా ద్వారకా క్రీడాకారులను ప్రోత్సహించే రీతిలో ఈ కార్యక్రమం పెడుతున్నారు. ఈ ఏడాది మొత్తం 278మందికి క్రీడా ప్రతిభా పురస్కారాలను నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ చేతుల మీదుగా అందించారు. క్రీడాకారులకు నగదు ప్రోత్సాహకంతో పాటు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాలను కూడా అందజేశారు. ఈ సందర్భంగా 4ఏళ్ల నుండి క్రమం తప్పకుండా క్రీడా ప్రతిభ పురస్కారాలను అందజేస్తున్న ద్వారకను ఎమ్మెల్యే అనిల్ అభినందించారు.



ఈ కార్యక్రమంలో రాకేష్‌చౌదరి, ఎం.ప్రసాదరావు, వెంకట్, శ్రీరాంసురేష్, రవీంద్ర, యతిరాజ్, వెంకటేశ్వర్లు, సురేష్, రామ్మూర్తి, సరాబు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



# చెలరేగుతున్న గ్రామసింహాలు

**నెల్లూరు రోడ్ల మీద మనుషులకంటే కుక్కలు, పందులు, ఆవులు ఎక్కువుగా కనిపిస్తుంటాయి. కోతులుండేది చెట్ల మీద కాబట్టి, వాటిని ఈ లెక్కలోకి తీసుకోలేము. కుక్కలు, పందులు, కోతులు... ఈ మూడు జాతుల జీవాలు జనానికి చుక్కలు చూపిస్తున్నాయి. నగరం నడిబొడ్డులోని ప్రాంతాల్లో కూడా కోతులు తిష్టేసివున్నాయి. ఏదో ఒక సందులో నుండి ఇళ్లల్లో దూరడం, దొరికిన వస్తువులను, ఆహారపదార్ధాలను తీసుకోవడం, ఇళ్లను గందరగోళం చేయడం పరిపాటైంది.**

ఇక నగర సందుల్లో పందులైతే మందలు మందలుగానే వుంటున్నాయి. పంది ఒకే ఈతలో పది కంటే ఎక్కువ పిల్లల్ని కంటుంది. దీంతో పందుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. పందులు కాసేవాళ్లు నగరంలోని ముఖ్యమైన కాలనీల్లోనే ఉంటున్నారు. తమ ఇళ్ల వద్దనే పందులను పెంచుతున్నారు. ఈ పందులు అన్ని వీధుల్లో తిరుగుతూ తామూ నగరపౌరులమే అన్నట్లుగా విహరిస్తున్నాయి. పందుల మూలంగా అనేక జబ్బులు ప్రబలుతున్నాయని తెలిసినా వీటిని పట్టుకుని తరలించలేని నిస్సహాయస్థితిలో నెల్లూరు నగరపాలక సంస్థ వుంది. ఆమధ్య అధికారులు స్పందించి కొన్ని ప్రాంతాల్లో పందులను పట్టి లారీల్లోకి ఎక్కించి నగర శివార్లలో వదలాలని చూసారు. పందుల పెంపకందార్లు ఆ లారీలకు అడ్డంపడి పందులను విడిపించుకుపోయారు. పందుల పెంపకం ఒక వ్యాపారం. వాటి యజమానులుంటారు. కాబట్టి అడ్డం పడతారు. మరి వీధికుక్కలను పట్టి దూరంగా వదిలేయడానికి ఉన్న ఇబ్బందేమిటి? నగరంలోని అన్ని ప్రాంతాల్లో కుక్కలు బ్యాచ్‌లు బ్యాచ్‌లుగా తిరుగుతున్నాయి. ఎక్కడన్నా కుక్కల గుంపుందంటే ఆ వీధిలో పోవడానికి జనం భయపడుతున్నారు. ఇటీవలే మూలాపేటలో కుక్కలు కరిచి 11మంది గాయపడ్డారు. మాగుంట లే అవుట్ కింగ్స్‌కోర్టు అవెన్యూలోనూ కొందరిని కుక్కలు కరిచాయి. నగర శివారు కాలనీల్లో కుక్కల బెడద ఎక్కువుగా వుంది. ముఖ్యంగా చిన్నారులు ఒంటరిగా స్కూళ్లకు వెళుతుంటారు. కుక్కల బెడద ఎక్కువ కావడంతో తల్లి దండ్రులు భయపడుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి అన్ని ప్రాంతాల్లో కుక్కలు, పందుల బెడదను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాల్సి వుంది.



# ఇసుక అక్రమాలకు తహాశీల్దార్ల సహకారం

**- నెల్లూరుజిల్లా కలెక్టర్ ఎం.జానకి**

ఇసుక రీచ్‌లలో అక్రమ రవాణా జరుగుతున్నా ఇప్పటివరకు ఏ ఒక్క తహాశీల్దారు, ఎంపిడిఓ తమ దృష్టికి తీసుకురాలేదని, ఇసుక రీచ్‌లలో తహాశీల్దార్లు పూర్తిస్థాయిలో తనిఖీలు చేపట్టడం లేదని, దీనిని బట్టి చూస్తే ఇసుక అక్రమాలకు తహాశీల్దార్లు సహకారం అందిస్తున్నట్లు అర్ధమవుతుందని నెల్లూరుజిల్లా కలెక్టర్ యం.జానకి పేర్కొన్నారు.

ఆదివారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఇసుక కమిటీలతో కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక అమ్మకాల్లో రీచ్‌ల వారీగా పరిశీలిస్తే క్రమంగా తగ్గిపోతున్నాయన్నారు. చాలావరకు అక్రమాలు జరుగుతున్నట్లు తెలుస్తోందన్నారు. మే, జూన్ నెలల్లో ఎక్కువ అమ్మకాలు జరిగితే జూలై, ఆగస్టు మాసాల్లో తగ్గిపోవడం ఏమిటన్నారు. అక్రమాలు అరికట్టేలా మే, జూన్ నెలల్లో ఎంత ఇసుక అమ్మకాలు జరిగాయో వాటి సరాసరి తీసుకుని రీచ్‌లకు లక్ష్యాలను నిర్దేశిస్తామన్నారు. తహాశీల్దార్లు తనిఖీలు చేయడంలో పూర్తి స్థాయిలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. సెప్టెంబర్ ఒకటి నుంచి జిపిఎస్ పరికరాలతో ఉన్న వాహనాన్నే ఇసుక తరలించేందుకు అనుమతించాలన్నారు. జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ మాట్లాడుతూ సమస్య రాక ముందే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

ఈ సమావేశంలో డిఆర్‌డిఏ పిడి చంద్రమౌళి, తహాశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.



## పెట్రోలు బంకుల బంద్

ఫెడరేషన్ పెట్రోలు బంకు డీలర్ల అసోసియేషన్ పిలుపు మేరకు నెల్లూరుజిల్లా వ్యాప్తంగా పెట్రోలు బంకుల డీలర్లు తమ సమస్యల పరిష్కారం కోసం ఆదివారం అర్ధరాత్రి నుంచి బంద్ పాటించారు. ఆదివారం అర్ధరాత్రి 12గంటల నుంచి సోమవారం సాయంత్రం 6గంటల వరకు బంద్ పాటించడంతో ద్విచక్రవాహన దారులు, ఆటోవాలాలు ఇబ్బందులు పడ్డారు. జిల్లా వ్యాప్తంగా 204 పెట్రోలుబంకులు ద్వారా ప్రతిరోజూ 8లక్షల లీటర్ల డీజిల్, 5లక్షల పెట్రోలు అమ్మకాలు జరుగుతాయి. బంద్ కారణంగా 18గంటలు బంకులు మూతపడటంతో రూ.4.66కోట్ల వ్యాపారం నిలిచిపోయింది. దీంతో ప్రభుత్వానికి రావాల్సిన 32లక్షల వ్యాట్ ఆగిపోయింది.



# ప్రత్యేకహోదా ఆశ ఇంకా మిగిలేవుంది!

**- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు హరిబాబు**

రాష్ట్రానికి ప్రత్యేకహోదా ఇచ్చేందుకు కేంద్రప్రభుత్వం పరిశీలన జరుపుతోందని భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.హరిబాబు పేర్కొన్నారు. మంగళవారం నెల్లూరులో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రత్యేకహోదా విషయంలో కొంతమంది రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నారని, రాష్ట్రానికి కేంద్రప్రభుత్వం ఏమీ చేయలేదన్న దుష్ప్రచారం చేస్తున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఈ ప్రచారంలో వాస్తవం లేదని, ఏ రాష్ట్రానికీ చేయని ప్రయోజనాలు కేంద్రం నుంచి ఆంధ్రాకు అందాయని వివరించారు. రాష్ట్ర విభజన అనంతరం ఒకేసారి అయిదు జాతీయ స్థాయి విద్యా సంస్థలను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రం మనదేనన్నారు. దీనికి దాదాపు రూ.3500కోట్లు కేటాయించిందని తెలిపారు. త్వరలో మరికొన్ని విశ్వవిద్యాలయాలు ప్రారంభం కానున్నాయని ప్రకటించారు. అలాగే రాష్ట్రంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధానకార్యదర్శి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి పాల్గొన్నారు.




శ్లో॥ నైనం ఛిందంతి శస్త్రాణి నైనం దహతి పావక: ॥
నచైనం క్లేదయంత్వాపో నశోషయతి మారుత: ॥ (గీత)

**సంస్మరణ**

మా అందరిలో ఒకడిగా, మాకందరికీ తోడుగా
నీవు లేని ఈ లోకం, రూపుదాల్చిన శోకం!

మా గుండెల్లో గుడి కట్టి పదిలంగా నిలిచావు.
మా హృదయాల్లో కలకాలం జీవించే ఉంటావు!!!

నీ స్మృతిలో...

**స్వప్న** - భార్య

**జె.వి.రెడ్డి** - తండ్రి
**జానకి** - తల్లి

చెల్లెలు - బావ
**శరణ్య - డా॥ అశోక్**

కుమార్తెలు - అల్లుడు
**సంజన - కుషాన్**
**సుస్మిత**

మేనల్లుడు - మేనకోడలు
**అస్విన్ - షీనా**

మరియు
**కుటుంబసభ్యులు**



**జక్కా హర్షవర్ధన్‌రెడ్డి**

జననం: 04.10.1957 మరణం: 07.09.1997

# సేవాగుణం కలవారు గూడూరువాసులు

**- జిల్లా జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్**



విద్యార్థినులకు నగదు ప్రోత్సాహకాలను అందజేస్తున్న జేసీ ఇంతియాజ్, ప్రక్కన ఎమ్మెల్యే సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ దేవసేన

గూడూరువాసులకు సేవాగుణం ఉందని జిల్లా సంయుక్త పాలనాధికారి ఇంతియాజ్ అన్నారు. గూడూరులోని దర్గావీధిలోని దర్గా ప్రాంగణంలో వృద్ధుల ఆశ్రమానికి సాయి సత్సంగ నిలయం ఆర్థిక సాయంతో కోట సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం రూ.5లక్షలతో నిర్మించిన భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం దర్గా ఆవరణలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, డిఎస్పీ బి.శ్రీనివాస్‌లతో కలసి ఆయన మొక్కలు నాటారు. స్థానిక ప్రజలు జేసీకి వినతులు అందజేశారు. వీటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దాతలు కోట ప్రకాశం, కోట సునీల్, కౌన్సిలర్లు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, నాశిన నాగులు, వాటంబేడు శివకుమార్, షంషీరా, స్థానికులు షేక్ రియాజ్ అహ్మద్, శ్రీధర్, ఔరంగబాషా, మగ్బూల్ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు



# వాకర్స్ హెల్త్‌క్లబ్ నూతన కమిటి

గూడూరు వాకర్స్ హెల్త్‌క్లబ్ నూతన కమిటి ఎన్నిక ఆదివారం అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో జరిగింది. అధ్యక్షుడుగా వేగూరు రాజేంద్రప్రసాద్, కార్యదర్శిగా వాసుగౌడ్, ట్రెజరర్‌గా కృష్ణ, ఇతర సభ్యులు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నేతాజీ స్కూల్ సుబ్బారెడ్డి, మైథిలి స్కూల్ మనోహర్‌రెడ్డి అతిథులుగా పాల్గొని మాట్లాడారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ గూడూరు వాకర్స్ సభ్యులందరికి ఆరోగ్యం పట్ల అవగాహన మరియు ప్రతి నెల డాక్టర్లు చేత మెడికల్ క్యాంపు, యోగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో కె.మునిగిరీష్, డాక్టర్ చంద్రహాస్, నారా గోపాల్, ఎన్.ఎస్.రెడ్డి, వల్లంకొండ వెంకటేశ్వర్లు, సోమిశెట్టి రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టరేటు వచ్చిన శారదమ్మను సన్మానించారు.

# విద్యార్థినులకు పళ్లేల పంపిణీ



విద్యార్థినులకు పళ్లేలు పంపిణీ చేస్తున్న యంఇఓ దిలీప్‌కుమార్, ప్రక్కన రోటరీ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి

గూడూరు మండలం చెన్నూరు బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం గూడూరు రోటరీక్లబ్ దాత దివ్యా ట్రస్టు ద్వారా దివ్య శీనయ్య 300మంది విద్యార్థినులకు భోజన పళ్లేలను యంఇఓ దిలీప్‌కుమార్ ద్వారా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యంఇఓ మాట్లాడుతూ దాతలు ఇచ్చిన దానిని సద్వినియోగం చేసుకుని బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని కోరారు. రోటరీ అధ్యక్షుడు అశోక్‌చక్రవర్తి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని, అధైర్యపడకుండా చదువులో రాణించాలని పిలుపునిచ్చారు. ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు కాంచన, కార్యదర్శి పి.వి.కృష్ణయ్య, రొటేరియన్లు ఎన్.వి.రత్నం, కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, మల్లయ్య, వెంకటేశ్వర్లురెడ్డి, రఘురామిరెడ్డి, రామకృష్ణస్వరూప్, మండల ఉపాధ్యక్షురాలు మట్టం శ్రావణి, రాజారెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# తోళ్ళ పరిశ్రమ వద్దు

**- కోట మండల ప్రజలు**



గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయాన్ని సోమవారం మూడు మండలాల ప్రజలు, నాయకులు ముట్టడించి ఆందోళన నిర్వహించారు. కోట మండలం కొత్తపట్నం ప్రాంతంలో తోళ్ళ పరిశ్రమ ఏర్పాటును విరమించాలని డిమాండ్ చేశారు. ప్రజలు, మత్స్యకారులు వివిధ ప్రజా సంఘాల నాయకులు తోళ్ళ పరిశ్రమ వ్యతిరేక ఉద్యమకారులు సోమవారం భారీ సంఖ్యలో పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో ముట్టడించారు. కార్యాలయం ముందు ధర్నా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. గూడూరు డివిజన్‌లోని కోట మండలం కొత్తపట్నం ప్రాంతంలో ఏర్పాటు చేయనున్న అంతర్జాతీయ తోళ్ళ పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా గూడూరు సాయిబాబా గుడి వద్దకు చేరుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు, ప్రత్యేకదళాలను ఏర్పాటు చేశారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ మీదుగా హాస్పిటల్ రోడ్డు, గడియారపు స్థంభం మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే క్రమంలో పోలీసులు వారిని నిలిపివేశారు. తాము శాంతియుతంగా ధర్నా చేస్తామని సబ్‌కలెక్టర్‌కు తమగోడును విన్నవించుకుంటామని చెప్పడంతో పోలీసులు అనుమతించారు. అనంతరం సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ వివిధ పార్టీల నాయకులు ప్రజా సంఘాల ప్రతినిధులు ప్రజలు కలిసి ధర్నా, నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న ఆందోళనకారుల వద్దకు ఇన్‌ఛార్జి ఆర్డీవో బాబయ్య చేరుకుని వారి నుంచి వినతిపత్రం స్వీకరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతానని తొందరలో నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. దాంతో వారు శాంతించారు.

ఈ కార్యక్రమంలో అఖిలపక్ష నేతలు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ప్రసాద్‌గౌడ్, మనోజ్‌కుమార్‌రెడ్డి, నేదురుమల్లి పద్మనాభరెడ్డి, మాధవ్, యాదగిరి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# బిఎస్‌ఎన్‌ఎల్ మెరుగైన సేవలు

**- టెలికాం డిఇ కృష్ణమూర్తి**



మాట్లాడుతున్న డిఇ వాన కృష్ణమూర్తి, పక్కన ఎస్‌డిఓటి టి.మనోహరరెడ్డి

నెల్లూరుజిల్లా వాసులకు బిఎస్ఎన్ఎల్ ల్యాండ్ ఫోన్ నుంచి రాత్రి 9గంటల నుండి ఉదయం 7గంటల వరకు దేశంలోని ఏ నెట్‌వర్క్ ల్యాండ్ ఫోన్ కైనా, ఏ నెట్‌వర్క్ మొబైల్‌కైనా ఉచితంగా అపరమిత కాల్స్ చేసుకునే సదుపాయం మే నెల 1వ తేదీ నుండి కల్పించినట్లు బిఎస్ఎన్ఎల్ డివిజనల్ ఇంజనీర్(సిఎఫ్ఎ) వాన కృష్ణమూర్తి 'లాయర్'కు తెలిపారు. ప్రస్తుత బిఎస్ఎన్ఎల్ ఫోన్ వినియోగదారులకు, బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులకు మే నెల 1వ తేదీ నుండి ఈ సదుపాయం కల్పించినట్లు, వీటితో పాటు క్రొత్త కనెక్షన్ తీసుకునే వినియోగదారులకు కూడా ఈ సదుపాయం కలదని అన్నారు. ల్యాండ్ లైన్‌కు కట్టవలసిన బకాయిదారులు వాయిదా పద్ధతిలో కట్టేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. కాగా, కొత్త ప్లాను అమూల్య ప్రస్తుతం వినియోగదారులకు వివిధ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. మొబైల్ వినియోగదారులకు ఆల్ ఇండియా రోమింగ్ ఉచితమని, రీ కనెక్షన్ వినియోగదారులకు ఇన్‌స్టలేషన్ ఛార్జెస్ ఫ్రీగా ఇస్తున్నట్లు డిఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్.డి.ఓ.టి టి.మనోహరరెడ్డి పాల్గొన్నారు.

## గ్రామ రెవెన్యూ అధికారుల సంఘ

# కొత్త కార్యవర్గం



మాట్లాడుతున్న డివిజన్ విఆర్వోల సంఘ అధ్యక్షుడు గిద్దలూరు రమణయ్య

గూడూరు డివిజన్ గ్రామ రెవెన్యూ అధికారుల నూతన కార్యవర్గాన్ని ఆదివారం నాడు గూడూరులోని గ్రామ సేవకుల భవనంలో ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులు పంట అశోక్‌కుమార్‌రెడ్డి, దారా వెంకట రమణయ్యల ఆధ్వర్యంలో డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. డివిజన్ అధ్యక్షులుగా గిద్దలూరు రమణయ్య, కార్యదర్శిగా బూతాటి శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా మురళీకృష్ణ, రమేష్, పొటేళ్ళ రాధ, సంయుక్త కార్యదర్శులుగా పురందర రజనీష్, ఈశ్వరరాజు, మోబీనా ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా మురళీధర్, కృష్ణయ్య, చెంచయ్య, కోశాధికారిగా సిహెచ్ అఖిల్‌లు ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో డివిజన్ విఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

# అనాథ చిన్నారుల మధ్య చిన్నారి జన్మదినోత్సవం

జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి పందిళ్ళపల్లి అరుణమ్మ మనుమరాలు, పందిళ్ళపల్లి హేమంత్‌కుమార్‌రెడ్డి కుమార్తె కామాక్షి హన్విత నాలుగవ జన్మదినోత్సవ వేడుకలు ఆగస్టు 26వ తేదీ నెల్లూరు కొండాయపాలెంరోడ్డులోని వాత్సల్య అనాథాశ్రమంలో చిన్నారుల మధ్య నిర్వహించారు. బర్త్‌డే కేక్‌ను కట్ చేయించి, ఆశ్రమంలోని 180మంది చిన్నారులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అరుణమ్మ, పట్టాభిరామిరెడ్డి, హేమంత్‌కుమార్ దంపతులతో పాటు ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.



శ్రీను గల్పిక

# స్వర్గం వైపు దూసుకెళ్ళిన జిఎస్ఎల్వి

అది స్వర్గలోకం. స్వర్గలోకాధిపతి తన క్రింది అధికారులతో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశాడు. స్వర్గలోకాధిపతి మాట్లాడుతూ... మన లోకంలో ఉంటున్న వారిలో ఈమధ్య కొంచెం అసంతృప్తి కనిపిస్తోంది. స్వర్గం అంటేనే అసంతృప్తి కనిపించకూడదు. మనం ఇక్కడ చేపట్టాల్సిన మార్పులు చేర్పులు ఏమన్నా ఉంటే చెప్పండని అడిగాడు. అప్పుడు ఒక అధికారి లేచి... మనం ఇంకా పాత విధానాలనే అవలంభిస్తున్నాం. ఆ రంభ, ఊర్వశి, మేనకలను చూసి జనానికే కాదు, మాకూ బోర్ కొడుతుంది. భూలోకవాసులు ఇంటర్నెట్, ఫేస్‌బుక్, వాట్సప్, మల్టీప్లెక్స్, పబ్‌లు, బార్‌లు వంటి వాటికి అలవాటు పడుతున్నారు. ఇక్కడికొచ్చాక అవేవీ కనిపించకపోతుండడంతో బోర్‌గా ఫీలవుతున్నారు. మనం కూడా స్వర్గలోకంలో ఆ ఆధునిక సౌకర్యాలన్నీ ఏర్పాటు చేద్దామని ప్రతిపాదించాడు. అంతలో అక్కడకు భారతరత్న అబ్దుల్ కలాం వచ్చాడు. స్వర్గలోకాధిపతి లేచి గౌరవంగా... ఏం గురువర్యా ఇలా వచ్చారని అడిగాడు. దానికి కలాం... నెల్లూరు జిల్లా శ్రీహరికోటలోని షార్ సెంటర్ నుండి జిఎస్ఎల్వి–డి6 రాకెట్‌ను వదులుతున్నారు. ఆ రాకెట్ ప్రయోగాన్ని చూడాలని నా మనసు ఆరాటపడుతుంది. ఆ షార్ మీద, ఆ రాకెట్ల మీద నాకున్న ప్రేమ అలాంటిది అని అన్నాడు. అందుకు స్వర్గలోకాధిపతి... మహానుభావా, మీకు ఒక్కరోజు సెలవు ఇవ్వడం మాకు పెద్ద సమస్యేమీ కాదు. కాకపోతే భూలోకంలో వున్న ఆధునిక టెక్నాలజీనంతా మన లోకంలోనూ ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. దీనికి మీ సహకారం అవసరం. ఆ రాకెట్ ప్రయోగం జరిగే రోజు ఇక్కడే టీవీని ఏర్పాటు చేయిస్తాను, టీవీలో మీతో పాటు మేమూ ఆ ప్రయోగాన్ని చూసి ఆనందిస్తాము, మీ ద్వారా ఆ ప్రయోగం గురించి తెలుసుకుంటామన్నాడు. దానికి కలాం సమ్మతించడంతో స్వర్గలోకాధిపతి సంబరపడిపోయాడు.

★★★★★

అది శ్రీహరికోటలోని షార్ సెంటర్. ఇస్రో ఛైర్మెన్ ఛాంబర్‌లో ఛైర్మెన్ కిరణ్‌కుమార్‌తో పాటు మాజీ ఛైర్మెన్ రాధాకృష్ణన్, షార్ డైరెక్టర్ కున్హికృష్ణన్, మాజీ డైరెక్టర్‌లు యం.వై.యస్.ప్రసాద్, నారాయణ, షార్ అసోసియేట్ డైరెక్టర్ టి.సుబ్బారెడ్డి, శాస్త్రవేత్త శేషగిరిరావు, ఇంకొందరున్నారు. కిరణ్‌కుమార్ చాలా టెన్షన్‌గా ఉన్నాడు. చేతులు నలుపుకుం టున్నాడు. ఆయన పరిస్థితి చూసి ఎం.వై.యస్.ప్రసాద్... ఎందుకు సార్, అంత టెన్షన్ పడుతున్నారు అని అడిగాడు. దానికాయన... నేను ఛైర్మెన్ అయ్యాక జిఎస్ఎల్వి సిరీస్‌లో ఇది తొలి ప్రయోగం. సక్సెస్ అవుతుందా కాదా అన్నదే నా భయమన్నాడు. వెంటనే మాజీఛైర్మెన్ రాధాకృష్ణ అందుకుని... మీరేం వర్రీకాకండి సార్, రాకెట్ విజయవంతానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాంప్రదాయ బద్ధంగా రాకెట్ నమూనాకు పూజలు చేసాం, పండితులు చెప్పిన ముహూర్తానికే రాకెట్ నిర్మాణం మొదలుపెట్టాం, వాళ్లు చెప్పిన ముహూర్తానికే లాంచింగ్ ప్యాడ్‌లో నిలబెట్టాం. ప్రయోగం టైం కూడా పంతులు పెట్టిందే. రాకెట్‌కు ఇతర దేశాల దిష్టి తగలకుండా గుమ్మడికాయలతో దిష్టి తీసి నాలుగు ఇంజన్లకు నిమ్మకాయలు కూడా కట్టించాం. ఇంత పకడ్బందీగా ఏర్పాట్లు చేసాక రాకెట్ విజయవంతం కాకుండా ఉంటుందా? అని ధీమాగా చెప్పాడు. అయినా కిరణ్‌కుమార్‌లో భయం తొలగలేదు. ఏదో నాకు ఈ జిఎస్ఎల్వి సిరీస్ అంటేనే భయమేస్తోంది. పూజలు, టెక్నికల్ సైడ్ కాకుండా నాన్‌టెక్నికల్ సైడ్ ఆలోచించండి. ఇంకేమన్నా బెటర్ చర్యలు తీసుకోవాలేమో... ఆ దిశగా దృష్టి పెట్టండని కిరణ్‌కుమార్ అన్నాడు. అప్పుడు షార్ మాజీడైరెక్టర్ నారాయణ లేచి... ప్రయోగానికి ఇక నాలుగు గంటలే సమయముంది. ఇంత తక్కువ సమయంలో లాజిక్‌గా ఆలోచించి మనకు పరిష్కారం చూపగలిగే ఒకే ఒక వ్యక్తి స్టైల్ ఆఫ్ సింహపురి ఆనం వివేకానంద రెడ్డి(64+). ఆయనను ఇప్పుడే పిలిపిస్తానంటూ నారాయణ వెంటనే వివేకాకు ఫోన్ చేసి తమ సమస్యను చెప్పాడు. దేశానికి సంబంధించిన సమస్య కాబట్టి వివేకా కూడా వెంటనే స్పందించాడు. నేరుగా స్టోన్‌హౌస్‌పేటకు వెళ్లాడు. అక్కడ ఓ గోడౌన్ వద్ద లోడ్‌చేసి వున్న లారీని ఎక్కి తానే స్వయంగా తోలుకుంటూ షార్ సెంటర్‌కు చేరుకున్నాడు. వివేకాను చూడగానే షార్ శాస్త్రవేత్తలందరిలో కొండంత ధైర్యం వచ్చింది. అయితే అతను లారీలో రావడమే వాళ్లను ఆశ్చర్యానికి గురిచేసింది. కిరణ్‌కుమార్, రాధాకృష్ణన్, ఎం.వై.యస్.ప్రసాద్, కున్హికృష్ణన్, సుబ్బారెడ్డి, శేషగిరిరావు... అందరూ వివేకాను తీసుకుని లాంచింగ్ ప్యాడ్ వద్దకు వెళ్లారు. రాకెట్‌ను చూసిన వివేకా... రాకెట్‌కు అమర్చిన నాలుగు ఇంజన్‌లలో ఏం నింపారని అడిగాడు. ద్రవ, ఘన ఇంధనాలను నింపామని కిరణ్‌కుమార్ చెప్పాడు. వెంటనే వివేకా షార్ సిబ్బంది చేత నాలుగు ఇంజన్‌లలో వున్న ఇంధనాన్ని బయటకు తీయించాడు. అంతా ఖాళీ చేసాక తాను తెచ్చిన లారీ వెనుక డోర్‌ను ఓపెన్ చేసాడు. లారీ నిండా ఉల్లిపాయల బస్తాలు... ఒక్కో బస్తాను విప్పదీసి నాలుగు ఇంజన్‌ల నిండా ఉల్లిపాయలు నింపాడు. తర్వాత ఇంజన్‌లను క్లోజ్ చేసి... తన నోట్లో సిగరెట్ పెట్టుకుని అగ్గిపుల్లతో వెలిగించుకున్నాడు. అలాగే మండుతున్న అగ్గిపుల్లను రాకెట్ వైపు విసిరేసాడు. అంతే అరక్షణంలో నిప్పులు విరజిమ్ముతూ జిఎస్ఎల్వి–డి6 రాకెట్ నింగికేసి దూసుకుపోసాగింది. శాస్త్రవేత్తలంతా నోరెళ్లబెట్టి ఆశ్చర్యంతో చూస్తుండగా... వివేకా స్టైల్‌గా... ఈరోజుల్లో ఉల్లిపాయల కంటే పవర్‌ఫుల్ ఇంధనం ఏముంది. పరిస్థితులను బట్టి తెలివితేటలు వాడుతుండాలంటూ కారెక్కాడు.

★★★★★

నింగికేసి దూసుకొస్తున్న జిఎస్ఎల్వి–డి6 రాకెట్‌ను స్వర్గలోకాధిపతితో పాటు అబ్దుల్‌కలాం టీవీలో వీక్షిస్తున్నాడు. అయితే కొద్దిసేపటికి తర్వాత కూడా రాకెట్ భూకక్ష్యలో ఆగకుండా ఇంకా పైకి దూసూకు రావడాన్ని కలాం గమనించాడు. ఆదుర్దాగా స్వర్గలోకాధిపతితో... సార్, కొంప మునిగింది, ఆ రాకెట్ మన లోకం వైపే దూసుకువస్తుంది. ఆ వివేకా ఇంజన్‌లలో అవసరానికి మించి ఉల్లిపాయలు ఎక్కువ నింపినట్లున్నాడు. ఆ ఇంజన్‌లు ఆగలేదు. ఇంకా శక్తివంతంగా పని చేస్తున్నాయి. రాకెట్ మనవైపే వస్తుంది. పారాహుషార్... పారిపోండి... ప్రాణాలు దక్కించుకోండని అరిచాడు. అంతే స్వర్గలోకాధిపతితో పాటు అక్కడున్న అందరూ ప్రాణభయంతో అక్కడ నుండి పరుగులు తీసారు.

---

### మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. వ్యాపార వర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును మరియు ఆశించిన ఆదాయం ఉండదు. వృత్తి పరంగా సంపాదన బాగుంటుంది. శుభకార్య ప్రయత్నాలు ఫలించగలవు. అవసరాలకు డబ్బు సర్దుబాటు అవుతుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరకగలవు. కొత్త వస్తువులు, యంత్ర పరికరాలు సమకూర్చుకొంటారు.

### వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

కృషి, పట్టుదలతో అనుకున్న పనులు సాధిస్తారు. వృత్తి వ్యాపార రంగాల వారికి మంచి అవకాశాలు దొరుకుతాయి. వ్యవహారాలు సొంతంగా చూచుకొనడం మంచిది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత, బాకీలు కొంతవరకు దొరకడం ఉంటుంది. ఉద్యోగులకు గుర్తింపు గౌరవాలుంటాయి. సోదరులకు మేలు జరుగుతుంది. స్థిరాస్తుల క్రయవిక్రయాలు నిర్ణయం కాగలవు.

### మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

పొగడ్తలు, మొగమోటాలకు, హామీలకు దూరంగా ఉండటం మంచిది. వృత్తి వ్యాపారాలలో మంచి అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభించగలవు. కోర్టు కేసులలో అనుకూలత ఉంటుంది. అధికారులకు స్థానమార్పులు, ఉద్యోగులకు అదనపు బాధ్యతలుంటాయి. నిర్మాణాలు, కాంట్రాక్టు పనులు చురుకుగా సాగుతాయి.

### కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఆదాయ వ్యయాలు సమతూకంలో ఉంటాయి. ఆర్థిక విషయాలలో ఆలోచనలు అంచనాలు ఫలించగలవు. బంధుమిత్రులతో సత్సంబంధాలుంటాయి. సోదర వర్గానికి మంచి జరుగుతుంది. అధికారులకు స్థాన చలనం ఉండవచ్చును. కాంట్రాక్టర్లు, గృహనిర్మాణాలు జరిపేవారికి ఇబ్బందికర పరిస్థితులుంటాయి. వృత్తి జీవనం కలవారికి, చిన్న వ్యాపారులకు లాభాలుంటాయి.

### సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

పంతాలు పట్టుదలలకు పోకుండా సమస్యలను పరిష్కరించుకొనండి. ఖర్చులు అదనంగా పైనబడగలవు. దూరప్రయాణాలు జరుగును. ఆస్తి వ్యవహారాలు, కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. వస్తు వాహన రిపేర్లు ఉంటాయి. కొత్త పెట్టుబడులకు, వ్యాపార విస్తరణకు అనుకూల సమయం కాదు. ముఖ్యమైన పత్రాలు, నోటీసులు అందుకుంటారు.

### కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దర్పాలకు విలాసాలకు బాగా ఖర్చులుంటాయి. వృత్తి వ్యాపారాలలో స్వల్ప అభివృద్ధి, ఆదాయములుంటాయి. చేస్తున్న పనులు ఆలస్యంగా జరుగుతూ టెన్షన్ పెడతాయి. వ్యాపారులపై అధికారుల చర్యలుండవచ్చును. ఉద్యోగులకు శ్రమ ఎక్కువగా ఉంటుంది. దూర ప్రయాణాలతో చికాకు పడతారు. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావడం జరుగుతుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 04.09.2015 నుండి
తేది. 10.09.2015 వరకు

ఈ వారంలో మీనంలో కేతువు, కర్కాటకంలో కుజశుక్రులు, కర్కాటకంలో కుజశుక్రులు, సింహంలో రవి గురువులు, కన్యలో బుధ రాహువులు, వృశ్చికంలో శని, మకర కుంభ మీన మేష రాశులందు చంద్రుడు సంచరిస్తారు.

**పంచాంగము:**

తేది 9 బుధవారము గురుమౌఢ్యమి సమాప్తము.

తేది 5 శనివారము కృష్ణాష్టమి పర్వదినము మరియు ఉపాధ్యాయ దినోత్సవము.

**శ్రావణ మాస కృష్ణపక్ష తిథులు**

| | | | |
|---|---|---|---|
| తేది. 04 | శుక్ర | షష్ఠి | ఉ॥ గం.11.01వ॥ |
| తేది. 05 | శని | సప్తమి | ఉ॥ గం.9.15వ॥ |
| తేది. 06 | ఆది | అష్టమి | ఉ॥ గం.7.47వ॥ |
| తేది. 07 | సోమ | నవమి | ఉ॥ గం.6.45వ॥ |
| తేది. 08 | మంగళ | దశమి | ఉ॥ గం.6.14వ॥ |
| తేది. 09 | బుధ | ఏకాదశి | ఉ॥ గం.6.08వ॥ |
| తేది. 10 | గురు | ద్వాదశి | ఉ॥ గం.6.36వ॥ |

### తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ముఖ్యవిషయాలపై అయినవారితో సంప్రదింపులుంటాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి బాగుండి ఆదాయం పెరుగుతుంది. వ్యాపారవర్గాలకు అవకాశాలు చేజారిపోవచ్చును. బంధువులతో సమస్యలుంటాయి. కుటుంబసభ్యులతో భేదాభిప్రాయాలుంటాయి. ఉద్యోగులకు బాధ్యతల నిర్వహణలో గుర్తింపు గౌరవాలు బాగుంటాయి. ఆసక్తికర విషయాలు తెలుసుకొంటారు.

### వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయం బాగుంటుంది. బంధుమిత్రులకు సహాయ పడతారు. కోర్టు వ్యవహారాలు, ప్రభుత్వ అనుమతులు సానుకూలం కాగలవు. వృత్తి వ్యాపారాలలో మంచి ఆర్థికావకాశాలు దొరకడం, కొత్త పెట్టుబడులు పెట్టడం ఉంటుంది. దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకొంటారు. పెండింగ్‌లో పనులు అనుకూలము కాగలవు. విద్యాప్రగతి బాగుంటుంది.

### ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా సాగుతాయి. ఆదాయం పెరుగుతుంది. కంపెనీ మీటింగులకు, యూనియన్ సమావేశాలకు హాజరు కాగలరు. గృహ వస్తు వాహన రిపేర్లుంటాయి. కుటుంబసభ్యుల అనుకూలత మీకు సరిగా ఉండదు. స్థిరాస్తుల క్రయవిక్రయాలలో పునరాలోచన అవసరం. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి.

### మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

నిర్దుష్టమైన ప్రణాళికలతో ఆర్థికాభివృద్ధికి ప్రయత్నిస్తారు. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. అయితే విలాసములకు, పలుకుబడి పెంచుకొనడానికి ఖర్చులు ఎక్కువ పెడతారు. విందులు వేడుకలు, సభలు సమావేశాలలో పాల్గొంటారు. చేసే పనులు ప్రోత్సాహకరంగా సాగినా ఆలస్యం కాగలవు. పిల్లలు విద్యా వివాహ ప్రయత్నాలపై శ్రద్ధ చూపుతారు.

### కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఆర్థికాభివృద్ధి ప్రయత్నాలు తృప్తికరంగా ఉండవు. వృత్తి వ్యాపారాలలో సరైన అవకాశాలు దొరకక ఆదాయం తగ్గుతుంది. బంధువులతో విభేదాలు చోటు చేసుకుంటాయి. నిర్వహణ సామర్థ్యం బాగుండినా ఫలితం సరిగా ఉండదు. స్థిరాస్తుల వ్యవహారాలలో తొందరపాటు వద్దు. శుభకార్య ప్రయత్నాలు అనుకూలించగలవు. శరీరానికి గాయాలు తగలవచ్చును.

### మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ప్రభుత్వం నుండి రావలసిన డబ్బు బాకీలు, అనుమతులు ఆలస్యం కాగలవు. ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు అవసరం. వృత్తివ్యాపారాలలో కొత్త ప్రణాళికలతో ముందుకు సాగుతారు. ఆదాయం స్వల్పంగా పెరుగుతుంది. ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూల అవకాశాలుంటాయి. అనుకున్న పనులు విజయవంతంగా జరుపుతారు. కుటుంబసౌఖ్యం బాగుంటుంది.



కావలి కబుర్లు

# మహానేత ఆశయాలను కొనసాగిస్తాం



మహానేత దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖరరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని వైయస్సార్సీపీ జిల్లా అధికారప్రతినిధి పి.కామరాజు అన్నారు. బుధవారం వైయస్సార్ 6వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక వైసిపి కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు వై.యస్. చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా వచ్చి తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా వున్న వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కనుమర్లపూడి వెంకటనారాయణ మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి, పేదల ఆరాధ్య దైవం వై.యస్.రాజశేఖరరెడ్డి లేని లోటు రాష్ట్రంలో స్పష్టంగా కనిపిస్తుందన్నారు. రాష్ట్ర అభివృద్ధికి, పేదప్రజల బాగు కోసం ఆయన కష్టపడి పనిచేసిన విషయాన్ని ప్రజలకు వివరించారు. మరలా ఆయన ఆశయాలు సాధించాలన్నా, సంక్షేమ పథకాలు ప్రజలకు పూర్తిస్థాయిలో అందాలన్నా జగన్మోహన్‌రెడ్డికే సాధ్యమన్నారు. అనంతరం స్థానిక ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కుందుర్తి శ్రీనివాసులు, రూరల్ మండల కన్వీనర్ చింతం బాబుల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి గందం ప్రసన్నాంజనేయులు, జిల్లా కార్యవర్గసభ్యులు, ఆర్యవైశ్య సంఘ మాజీ అధ్యక్షులు అనుమాలశెట్టి శివ, మోహనరెడ్డి, రాము, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# బంగారు దొంగల అరెస్ట్



మాట్లాడుతున్న డిఎస్పీ బి.శ్రీనివాస్, ప్రక్కన రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి

నెల్లూరుజిల్లా రాపూరు మండలంలోని పెంచల కోనలో ఉన్న హరేరామ హరేకృష్ణ ఆశ్రమంలో దొంగతనానికి పాల్పడిన నిందితులను అరెస్టు చేసినట్లు గూడూరు డిఎస్పీ బి.శ్రీనివాస్ తెలిపారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఈ కేసు వివరాలను మంగళవారం సాయంత్రం వెల్లడించారు. పెంచలకోనలోని హనుమంతరెడ్డికి చెందిన హరేరామ హరేకృష్ణ ఆశ్రమానికి అదే మండలంలోని గోనుపల్లి గ్రామానికి చెందిన అచ్యుత పెంచలయ్య తరచూ వస్తుండేవాడు. ఆశ్రమాన్ని అభివృద్ధి చేసేందుకు హనుమంతరెడ్డి విరాళాలు సేకరిస్తూ ఆ నగదును ఆశ్రమంలో దాచేవాడు. పెంచలయ్య కూడా ఆశ్రమంలో పనులు చేస్తుండేవాడు. కృష్ణమందిరం నిర్మించేందుకు సేకరించిన నగదు ఉందని, విలువైన వజ్రాలు, బంగారు ఆభరణాలు ఉన్నాయని పెంచలకోనకు వచ్చిన ప్రకాశం జిల్లా కనిగిరికి చెందిన దేవెళ్ల శ్రీనుకు పెంచలయ్య చెప్పాడు. ఆ తరువాత కనిగిరికి వెళ్లిన శ్రీను తనకు తెలిసిన ఆటోషెడ్ నడుపుతున్న ఖాజామొహిద్దీన్‌కి విషయం చెప్పాడు. పెంచలయ్యతో ఫోన్లో మాట్లాడారు. నగదు, ఆభరణాల చోరీకి పథకం వేసారు. దీంతో తెనాలికి చెందిన శ్రీను, మహబూబ్‌నగర్‌కు చెందిన కోమల రామస్వామి, మధు, గిరి, సాయిలు కనిగిరికి చెందిన పాలపర్తిరాజు ఒక బృందంగా ఏర్పడ్డారు. పథకం ప్రకారం మధుకు చెందిన కారులో గత నెల 17న పెంచలయ్యను కలుసుకొని అదేరోజు అర్ధరాత్రి ఆశ్రమంలోకి ప్రవేశించారు. అక్కడే వున్న ఆశ్రమ నిర్వాహకుడు హనుమంతరెడ్డికి నెల్లూరు క్రైంబ్రాంచ్ పోలీసులమని చెప్పి బీరువా తీయించి అందులోని రూ.70వేలు నగదు, ఆశ్రమం బయట నిద్రిస్తున్న వంట మనిషి దగ్గర బంగారు ఉంగరం, నల్లపూసల దండ, రెండు సెల్‌ఫోన్లు తీసుకొన్నారు. హనుమంతరెడ్డిని బలవంతంగా కారులో తీసుకెళ్లారు. మార్గమధ్యంలో వజ్రాలు, బంగారు నగల గురించి దొంగలు ప్రశ్నిస్తే సమాధానం చెప్పకపోవడంతో కొట్టి పరారయ్యారు. దీంతో కేసు నమోదు కావడంతో ప్రత్యేకబృందాలు గాలింపు ప్రారంభించాయి. ఈ కేసులో కీలకపాత్ర పోషించిన పెంచలయ్యను సోమవారం రాపూరు సమీపంలోని మద్దెల మడుగు కూడలిలో అరెస్టు చేశారు. అతను ఇచ్చిన సమాచారంతో అదేరోజు కనిగిరిలోని ఖాజామొహిద్దీన్, రాజు, రామస్వామి, మధులను అరెస్టు చేశామని డిఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. వారి వద్ద నుండి రూ.15,500, బంగారు ఉంగరం స్వాధీనం చేసుకొన్నట్లు, ఇదే కేసులో నిందితుడైన శ్రీను అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మిగతా నగదు, నిందితులను త్వరలో పట్టుకొంటామన్నారు. నిందితులను పట్టుకున్నందుకు జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ సిబ్బందికి రివార్డులు ప్రకటించారని డిఎస్పీ బి.శ్రీనివాస్ తెలిపారు. రూరల్ సిఐ శ్రీనివాసులురెడ్డి, వాకాడు సిఐ పి.అక్కేశ్వరరావు, రాపూరు ఎస్ఐ షేక్ కరిముల్లా, హెడ్‌కానిస్టేబుల్ ఆర్.వెంకటేశ్వరరాజు, జె.వి.చిరంజీవులు, సుబ్రహ్మణ్యం, సుబ్బనాయుడు, నవీన్, సిహెచ్ సురేష్‌లకు రివార్డులు ప్రకటించారు.

# ప్రత్యేకహోదాతోనే రాష్ట్రాభివృద్ధి

## - ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి




ప్రత్యేకహోదాతోనే రాష్ట్రం అభివృద్ధి జరుగుతుందని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. వైయస్సార్సీపీ రాష్ట్ర అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు గత నెల29వ తేదీన రాష్ట్ర బంద్‌లో భాగంగా కావలిలో సంపూర్ణ బంద్ పాటించారు. స్వచ్ఛందంగా వ్యాపారులు, విద్యాసంస్థల వారు బంద్ పాటించారు. ఉదయం 4గంటల నుండి ఎమ్మెల్యే ఆర్టీసీ బస్టాండ్ వద్ద బైటాయించి బస్సులు కదలకుండా అడ్డుపడ్డారు. బస్సులు, ఆటోలతో సహా ఏ వాహనం తిరగనీయకుండా నాయకులు, కార్యకర్తలు బంద్ విజయవంతం చేశారు. అనంతరం పట్టణంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి సాధించాలంటే ప్రత్యేకహోదా అవసరమని, దాని వల్ల రాష్ట్రానికి అన్ని రాయితీలు వస్తాయన్నారు. రాయితీలు వస్తే పెట్టుబడుదారులు పరిశ్రమలను స్థాపించడం ద్వారా నిరుద్యోగసమస్య పరిష్కారం అవుతుందన్నారు. రాజధాని నిర్మాణానికి అవసరమైన 4లక్షల కోట్ల నిధులు రాబట్టాలన్నా, నీటిపారుదల ప్రాజెక్టులకు అవసరమైన ఖర్చు సమకూర్చాలన్నా ప్రత్యేకహోదా ద్వారా సాధ్యమవుతుందని, 16వేలకోట్ల లోటుబడ్జెట్‌ను పూడ్చేందుకు ముఖ్యమంత్రి ఎర్రచందన నిల్వలను అమ్మి కొంతవరకు మాత్రమే పూడ్చగలిగారన్నారు. ప్రత్యేక హోదా వల్ల ఉపయోగం లేదని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా వుందని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపీ నాయకులు సుకుమార్‌రెడ్డి, కనమర్లపూడి వెంకటనారాయణ, వామ పక్ష నాయకులు టి.మాల్యాద్రి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి కల్పనలో కందుకూరి గార్మెంట్స్ భేష్



కందుకూరి గార్మెంట్స్‌లో పేదలకు ఉపాధి కల్పించడం హర్షణీయమని ఎస్‌బిఐ జనరల్ మేనేజర్ హరేకృష్ణ జేన అన్నారు. సోమవారం జలదంకి మండలం జమ్మలపాలెం గ్రామంలో స్థాపించిన కందుకూరి గార్మెంట్స్‌ను రీజనల్ మేనేజర్ సురేష్‌లతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికుల సంక్షేమం కోసం ప్రధానమంత్రి బీమాసురక్షా యోజన పథకం క్రింద సుమారు 500 మంది కార్మికులకు కందుకూరి గ్రూప్ అధినేత కందుకూరి సత్యనారాయణ స్వంత నిధులతో ప్రీమియం చెల్లించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ కావలి లాంటి చిన్న ప్రాంతంలో ఇంత పెద్ద వస్త్ర పరిశ్రమను నెలకొల్పి పేదలకు ఉపాధి కల్పనలో కృషి చేస్తున్న కందుకూరిని అభినందించారు. ఇది చాలా సాహసోపేతమైన పని అన్నారు. కందుకూరి గ్రూప్స్ అధినేత, భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కందుకూరి వెంకటసత్యనారాయణ మాట్లాడుతూ పేదప్రజల సంక్షేమమే ధ్యేయంగా మోడీ ప్రభుత్వం పని చేస్తుందని, ప్రతి పేదవాడికి సంక్షేమ పథకాలు అందించే దిశగా జన్‌ధన్ పథకం క్రింద బ్యాంక్ ఖాతాలను ప్రారంభించారన్నారు. పరిశ్రమ ఏర్పాటుకు బ్యాంక్ వారి సహకారంతోనే ముందుకు వెళుతున్నామన్నారు. రీజనల్ మేనేజర్ సురేష్ మాట్లాడుతూ నాణ్యతతో కూడిన వస్త్రాలను కందుకూరి వస్త్రపరిశ్రమలో తయారు చేయడం పై హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికే కందుకూరి బ్రాండ్‌లు మార్కెట్‌లో మంచి గుర్తింపును పొందాయని, ఇలాగే మంచి నాణ్యతను కొనసాగిస్తే భవిష్యత్‌లో కందుకూరి బ్రాండ్ మరింత ఉన్నతస్థాయికి ఎదిగి విదేశాలకు ఎగుమతి చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కందుకూరి పుష్పావతి, లక్ష్మీరేఖ, సివిసి సత్యం తదితరులు పాల్గొన్నారు.

# ఎఎంసిలో అధికారుల ఇష్టారాజ్యం

## డైరెక్టర్ల మాట వినని అధికారులు



కావలి మార్కెటింగ్ యార్డ్‌లో అధికారులు వారి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ లక్షల రూపాయల ప్రభుత్వ నిధులను స్వాహా చేస్తున్నారని నూతనంగా ఏర్పడిన మార్కెటింగ్ కమిటి డైరెక్టర్లు కొందరు ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం దృష్టికి తీసుకువెళ్లినట్లు సమాచారం. గడచిన 4సంవత్సరాల కాలంలో పాలకవర్గం లేకపోవడంతో అధికారులకు అడ్డు లేకుండా పోయిందని, ప్రస్తుతం పాలకవర్గం ఏర్పడినా గతంలో మాదిరిగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకు నిదర్శనం మొదట జరిగిన ఎఎంసి సమావేశంలో డైరెక్టర్లు పలు అభివృద్ధి పనులపై అనుమానం వ్యక్తం చేస్తూ ఛైర్మెన్‌తో సహా మరుసటి సమావేశానికి పూర్తి వివరణ కోరినా అధికారులలో స్పందన లేకపోవడం. అంతేకాకుండా సమావేశ మందిరంలో ఫ్యాన్లు పని చేయడం లేదని 2వ సమావేశానికి రిపేరు చేయించాలని అధికారులకు సూచించారు. యదా రాజా... తథా ప్రజా అన్నట్లు రెండవ సమావేశంలో కూడా డైరెక్టర్లకు కావలసిన సమాచారాన్ని అందజేయలేదు. అలాగే వారు చెప్పిన ఫ్యాన్లు కూడా బాగు చేయించకపోవడంతో డైరెక్టర్లు మండిపడ్డారు. ముఖ్యంగా గదిలోపల చెమట్లు పట్టి ఉక్కపోస్తున్నా డైరెక్టర్ తిరువీధి ప్రసాద్ మాట్లాడుతున్న సమయంలో శ్రద్ధగా అక్కడే వుండి వారు చేసిన సూచనలను గుర్తించి అమలులో పెట్టవలసిన అధికారులు సమావేశం మధ్యలో లేచి వెళ్లిపోవడాన్ని వారు తీవ్రంగా తప్పుపట్టారు. ఈ విషయంపై ఛైర్మెన్ దేవరాల సుబ్రహ్మణ్యం సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇకపై ఇలాంటివి నా దృష్టికి వస్తే చర్యలు తప్పవని గట్టిగా హెచ్చరించారు.

# సినిమా స్టైల్లో హత్యకు కుట్ర

ఆ దంపతులకు వివాహమై 11 ఏళ్లు అయ్యింది. ఒక కుమారుడున్నాడు. భార్యతో మనస్పర్ధలు రావడంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో తన భార్య మరో వ్యక్తితో సహజీవనం చేస్తుండడంతో ఇద్దరిని ఒక్కసారి మట్టు పెట్టాలని నిర్ణయించుకుని చేసిన ప్రయత్నం బెడిసికొట్టి పోలీసులకు చిక్కాడు భర్త. వివరాల్లోకి వెళితే నెల్లూరుజిల్లా పొదలకూరు మండలం నందివాయికి చెందిన సోమవరపు శ్రీధర్‌రెడ్డికి బుచ్చి మండలం ఇస్కపాళెం పంచాయితీ కామాక్షినగర్‌కు చెందిన రమతో వివాహమైంది. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. ఆటో నడుపుతూ జీవనం సాగించే శ్రీధర్‌రెడ్డి, భార్యతో మనస్పర్ధలు రావడంతో కొంత కాలం నుంచి విడిగా వుంటున్నారు. శ్రీధర్‌రెడ్డి పొదలకూరులో వుండగా, రమ బుచ్చిరెడ్డిపాళెం మండలం కామాక్షినగర్ కాలనీలో ఉంటోంది. శ్రీధర్‌రెడ్డితో స్నేహంగా వున్న వ్యక్తి తన భార్యతో సహజీవనం చేస్తుండడంతో వీరిని మట్టుపెట్టాలని గతంలో యాసిడ్‌దాడి చేశాడు. అప్పుడు త్రుటిలో అపాయం తప్పింది. ఎలాగైనా ఇద్దరిని చంపాలని నిర్ణయించుకుని తన ఆటోలో నాటుబాంబులు, కత్తి, పెట్రోలు స్ప్రేమిషన్‌ను పెట్టుకుని గత నెల 29 సాయంత్రం కామాక్షినగర్ కాలనీలో ఉంటున్న రమ ఇంటికి చేరుకున్నాడు. తాను తెచ్చిన పెట్రోలును స్ప్రేయర్ మిషన్‌తో ఇంట్లో గోడలపై చల్లాడు. నాటు బాంబులను టిఫిన్ బాక్సులో పెట్టి ఓ చోట దాచాడు. ఇద్దరిని ఒకేసారి అంతం చేయాలని భావించాడు. అయితే పెట్రోలు స్ప్రే చేయడం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని శ్రీధర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 19నాటుబాంబులు, ఒక కత్తిని, పెట్రోల్ స్ప్రేయర్, టాటా మ్యాజిక్ ఆటోను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

# నలుగుతున్న నగరం

(మొదటి పేజీ తరువాయి)

అయితే ఈరోజు నెల్లూరు నగరపాలక సంస్థలో చోటుచేసుకున్న పరిస్థితులను చూస్తుంటే ఆరోజు వివేకా చేసిందే కరెక్ట్ అని చాలామంది అభిప్రాయపడుతున్నారు. కార్పొరేషన్‌లో వివేకా పెత్తనం నడిచినా పనులు జరిగాయి. వివేకాతో ఒక మాట చెప్పించుకుంటే అధికారులు ఆఘమేఘాల మీద పనులు చేసేవారు. వివేకా ఆదేశాను సారం అభివృద్ధి పనులు జరిగాయి. వివేకా కన్నెర్రజేసిన రోజు కానివారి బిల్డింగ్‌లను అధికారులు అదే హుషారుతో కూలగొట్టారు. కనీసం వివేకాతో ఒక మాట చెప్పించుకుంటే పని జరుగుతుందన్న నమ్మకం ఆరోజు ఉండింది.

ఇప్పుడు ఆ నమ్మకమే లేదు. ఎవరు చెబితే పనులు జరుగుతాయో అర్ధమే కావడం లేదు. నగరంలో ఎవరికి వాళ్లు స్వతంత్ర రాజులుగా చెలామణి అవుతున్నారు. నాయకులకు ఒకరంటే ఒకరికి పడదు. మేయర్ అజీజ్‌ది ఒక దారి. ఆయన దారిలో ఆయన పార్టీ వాళ్లే నడవరు. ఇక నగర ఎమ్మెల్యే పి.అనిల్ కుమార్‌కు, మేయర్ అజీజ్‌కు అసలు పడిచావదు. మేయర్ ఏదన్నా అనుకుంటే తన నియోజకవర్గంలో అనిల్ పడనీయడు. అనిల్ అనుకున్న పనులకు అజీజ్ ఆమోద ముద్ర వేయడు. రూరల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అనుకున్న పనులు కూడా అంతంత మాత్రంగా అవుతున్నాయి. కోటంరెడ్డి చెప్పిన పనులు చేస్తే మేయర్‌కు కోపం వస్తుందేమోనన్న భయంతో అధికారులు నలుగుతున్నారు. రూరల్ పరిధిలో తెలుగుదేశం ఇన్‌ఛార్జ్‌గా ఆదాల ప్రభాకర్‌రెడ్డి కూడా జోక్యం చేసుకుంటున్నారు. దీంతో ఎవరు చెప్పిన పనులు చేయాలో తెలియక కార్పొరేషన్ సిబ్బంది నలిగిపోతున్నారు. ఒక పనిని ఎమ్మెల్యేలు ప్రతిపాదిస్తే మేయర్ వద్దంటున్నాడు. మేయర్ ప్రతిపాదించిన పనులకు ఎమ్మెల్యేలు మోకాలడ్డుతున్నారు. మొత్తం మీద నగరంలో పనులు జరగడం లేదు. గతంలో ఒక ఇంటికి ప్లాన్ అప్రూవల్ కావాలంటే వివేకా లేకున్నా కాంగ్రెస్ కార్పొరేటర్ చెప్పినా అయిపోయేది. ఇప్పుడు ఎవరు చెప్పినా, ఎవరిచేత చెప్పించుకున్నా, చెప్పులరిగేలా కార్పొరేషన్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా తమ పనులు కావడం లేదని జనం మొత్తుకుంటున్నారు. మొత్తానికి నేతల పోరులో నగరం నలుగుతోంది.

# బాబుది కాదు... నాదే!

(మొదటి పేజీ తరువాయి)

స్వయంగా రైతుల ఇళ్లకెళ్లి ఆయనే పాస్‌బుక్‌లు, అడంగళ్లు తెచ్చుకున్నాడంటే అక్కడి భూములపై ఎంత తాపత్రయంతో ఉన్నాడో అర్ధమవుతుంది. ఈ భూములు చాలక భూసేకరణ చట్టం ప్రయోగంతో మరికొన్ని వేల ఎకరాల భూములను లాక్కోవడానికి ప్రభుత్వం ప్రయత్నించింది. నారాయణ అయితే మీరు భూములివ్వకుంటే భూసేకరణ చట్టం ద్వారా లాక్కుంటామని పదేపదే బెదిరిస్తూ వచ్చాడు. అనుకున్నంత పని జరిగింది. భూసేకరణకు జి.ఓ విడుదల చేసారు. దీంతో రైతులు తిరగబడ్డారు. విపక్షాలు ఆందోళనకు దిగాయి. ప్రతిపక్ష నేత జగన్ గుంటూరు జిల్లాలో పర్యటించి మీ భూములు మీకు తిరిగి ఇస్తామంటూ రైతులకు భరోసా ఇచ్చాడు. అందరికంటే అర్ధం పర్ధం లేకుండా మాట్లాడినా పవన్ కల్యాణ్ తిరగబడడం ప్రభుత్వానికి ప్రతిబంధకంగా మారింది. భూసేకరణపై ఆయన తీవ్రంగానే స్పందించడంతో ప్రభుత్వం తోక ముడవక తప్పలేదు. భూసేకరణ జిఓను వెనక్కి తీసుకుంటున్నట్లు ప్రకటించారు.

ఇక్కడ కామెడీ ఏంటంటే ముఖ్యమంత్రి చంద్రబాబుకు తెలియకుండానే భూసేకరణకు తాను నోటీసులు విడుదల చేసానని మంత్రి నారాయణ చెప్పడం. నారాయణ చెప్పేదాన్ని బట్టి చూస్తే ప్రభుత్వాన్ని చంద్రబాబు కాకుండా ఈయన నడుపుతున్నాడన్న అనుమానం వస్తుంది. అంటే చంద్రబాబు డమ్మీ అయ్యాడా? నారాయణ అంత పవర్‌ఫుల్ అయ్యాడా? భూసేకరణ పాపం చంద్రబాబుకు అంటకుండా ఈ పాపం అంతా నాదేనని నారాయణ నాటకం ఆడుతున్నాడా? ఏదేమైనా ఈ భూసేకరణ ఎపిసోడ్‌లో నారాయణ తన నటనాచాతుర్యంతో చంద్రబాబుకు మరింత విశ్వాసపాత్రుడయ్యాడు.

# ముందు ధనం...

(మొదటి పేజీ తరువాయి)

ఋణమాఫీ లాంటి తాయిలాల ఆశ చూపితే వెర్రిజనం గంపలతో తెచ్చి ఓట్లేస్తారు అనే బలమైన నమ్మకం ఆయనలో వుంది. డబ్బుంటే ఎన్నికల్లో సులభంగా నెట్టుకురావచ్చు. 2014ఎన్నికలు చాటి చెప్పింది ఈ సత్యాన్నే. అందుకే ముందు ఆర్థికంగా నిలదొక్కుకోవాలి. పుష్కరాలైనా, పట్టిసీమయినా, ప్రత్యేకప్యాకేజీలైనా... ముందు మనం నిలబడాలి. ఆ తర్వాతే రాష్ట్రం గురించి... చంద్రబాబు లెక్క ఇదే!

ఇప్పుడు అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. సమావేశాలలో ప్రతిపక్ష నేత జగన్ గొంతు చించుకుని ప్రభుత్వంపై దాడి చేస్తున్నారు. విపక్ష సభ్యులు విమర్శలు కురిపిస్తున్నారు. అయితే ఇవన్నీ చంద్రబాబుకు తెలియని విషయాలు కావు. అమరావతి రాజధాని పేరుతో రియల్ ఎస్టేట్ వ్యాపారం, పట్టిసీమ కాంట్రాక్ట్ ఒక వ్యాపారం... పుష్కరాల పేరుతో ఖాజానాను ఖాళీ చేయడం... ఇవన్నీ కూడా అధికారముండగానే ఆర్థికంగా నిలదొక్కుకునే పనులే! దేశ చరిత్రలోనే ఒక రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధి పేరుతో ఇంతగా వ్యాపారధోరణులకు తెరతీయడం ఎప్పుడూ లేదు.


## నవ్యాంధ్రలోనే అత్యుత్తమ హార్ట్‌కేర్ - ఇప్పుడు నెల్లూరులో

సింహపురి హాస్పిటల్స్ అందిస్తోంది ఒకేచోట పూర్తిస్థాయి కార్డియాలజీ సేవలు. సాధారణమైన లేదా సంక్లిష్టమైన, అన్ని రకాల గుండె సంబంధిత చికిత్సలు నిర్వహించడానికి నైపుణ్యాన్ని మరియు అనుభవాన్ని హాస్పిటల్ కలిగి ఉన్నది.

- ఉత్తమ శిక్షణ పొందిన, అనుభవజ్ఞులైన కార్డియాలజిస్టులు మరియు కార్డియాక్ సర్జన్ల పూర్తిస్థాయి టీం
- అందుబాటులో 24/7 కార్డియాలజిస్టులు
- ఐసియు, వెంటిలేటర్స్ లో సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్, అందుబాటులో కార్డియాక్ టీం మరియు ఇతర సూపర్ స్పెషలిస్టులు
- లామినార్ ఎయిర్‌ఫ్లోతో కూడిన నూతన హైబ్రిడ్ క్యాథెటరైజేషన్ ల్యాబులు, హెచ్‌ఇపిఎ ఫిల్టర్లు, హార్ట్ లంగ్ మెషిన్లు
- నాన్ ఇన్వాసివ్ కార్డియాలజీ సర్వీసులు (ఇసిజి, 2డి ఎకో, 4డి ఎకో, టిఎమ్‌టి, టిఈఈ, డిఎస్ఇ, పీడియాట్రిక్ ఎకో, హోల్టర్ మానిటరింగ్)
- ఇంటర్వెన్షనల్ కార్డియాలజీ మరియు కార్డియాక్ సర్జరీ

### ఒకేచోట పూర్తిస్థాయి సేవలు

24x7 ప్రైమరీ పిటిసిఎ

యాంజియోగ్రామ్ & యాంజియోప్లాస్టీ

- తొడ & ట్రాన్స్-రేడియల్ ప్రొసీజర్
- కరోటిడ్, మూత్రపిండ, పెరిఫెరల్, గ్రాఫ్ట్ & కరోనరీ
- ఆంజియోగ్రామ్ మరియు యాంజియోప్లాస్టీ

పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్

- తాత్కాలిక & శాశ్వతమైన పేస్‌మేకర్
- ఐసిడి & సిఆర్‌టి పరికరాలు
- సింగిల్ మరియు డబుల్ ఛాంబర్ పేస్‌మేకర్

బెలూన్ వాల్వోటోమీస్

- చిన్న పిల్లలో పుట్టుకలో ఏర్పడే గుండెలోని రంధ్రముల మూసివేత గుండె నిర్మాణ డిసీజ్ ఇంటర్వెన్షన్లు

ట్రాన్స్‌క్యాథేటర్ ఎంబాలిక్ థెరపీ

ఎండో-వాస్కులర్ ఓర్టా రిపేర్

అత్యాధునిక క్యాథ్‌లాబ్

సెంట్రల్ మానిటరింగ్ సిస్టమ్

3డి ఎకో

టిఎంటి

హార్ట్ హోల్టర్ కొరకు నాన్ ఇన్వాసివ్ ఆంజియో

### కార్డియాక్ సర్జరీ సర్వీసులు

- బైపాస్ సర్జరీ & పునరావృత బైపాస్ సర్జరీ
- వాల్వ్ రిపేర్ / రీప్లేస్‌మెంట్
- పుట్టుకతో వచ్చిన గుండె వ్యాధులకు ఓపెన్ హార్ట్ సర్జరీ
- గుండెలో ఏర్పడిన రంధ్రముల మూసివేత
- పెరిఫెరల్ వాస్కులర్ సర్జరీస్
- పెద్దలు మరియు పిల్లల ఇతర సర్జరీల కొరకు

### సంప్రదించండి:



డా॥ చిర్ర భక్తవత్సల రెడ్డి
MD, DM, (నిమ్స్-హైదరాబాద్)
సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్
ఇంటర్నేషనల్ అసోసియేట్
అమెరికన్ కాలేజ్ ఆఫ్ కార్డియాలజీ



డా॥ ఎ. భాస్కర్ రెడ్డి
MD, DM
కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్







Simhapuri Hospitals
Multi-Super Specialty Services

NH 5, Chinthareddypalem Crossroads Nellore, AP India T: 0861-6680100 www.simhapurihospitals.com

# నెల్లూరు హోదా మారుతుంది

**కేంద్రం దయతలచి, ఎన్నికల సమయంలో నరేంద్ర మోడీకి తాను చేసి, వాగ్ధానాలు గుర్తుకొచ్చి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకహోదా అంటూ ఇవ్వడం జరిగితే ఈ రాష్ట్రంలో ప్రథమంగా ప్రయోజనం పొందేది నెల్లూరుజిల్లానే! ఆ విధమైన అవకాశాలన్నీ కూడా ఇక్కడ ఉన్నాయి.**



ప్రత్యేకహోదాతో పరిశ్రమలకు రాయితీలొస్తాయి, పన్నుల్లో వెసలుబాటు ఉంటుంది. ఇంకా ఎన్నో రకాలుగా ప్రయోజనాలుంటాయి. కాబట్టి నెల్లూరు జిల్లా పారిశ్రామికంగా పరుగులు తీయడం ఖాయం. రాష్ట్రంలో ఉన్న 13జిల్లాల్లో చూస్తే పారిశ్రామిక ప్రగతికి ఎక్కువ అవకాశం ఉన్నది నెల్లూరుజిల్లాకే! జిల్లాలో అంతర్జాతీయ ప్రమాణాలు కలిగిన కృష్ణ పట్నం పోర్టు ఉంది. దుగరాజపట్నం పోర్టు నిర్మాణానికి కూడా గతంలోనే కేంద్రం ఆమోదం తెలిపింది. బెంగుళూరు–చెన్నై, విశాఖ–చెన్నై... ఈ రెండు పారిశ్రామిక కారిడార్‌లలో కూడా నెల్లూరు జిల్లా వుంది. నెల్లూరుకు దగ్గరగా చెన్నై, రేణిగుంట రెండు అంతర్జాతీయ విమానాశ్రయాలున్నాయి. అన్ని విధాలా సౌకర్యాలకు చెన్నై మహానగరం దగ్గరలోవుంది. రోడ్డు, రైల్ రవాణా సౌకర్యవంతంగా వుంది. పారిశ్రామికాభివృద్ధికి అతికీలకమైన అంశం భూసేకరణ. నెల్లూరుజిల్లాలో ఆ సమస్య లేదు. ఇప్పటికే కృష్ణపట్నం, శ్రీసిటీ, మేనకూరు, చింతవరం, ఇఫ్కో సెజ్‌లకు వేల ఎకరాలు సేకరించి వున్నారు. ఇంకా కూడా భూసేకరణకు సమస్య లేదు. కాబట్టి పరిశ్రమలు తరలిరావడానికి అనువైన ప్రాంతమిది. ఇక్కడ రాజకీయ పరిస్థితులు కూడా పారిశ్రామికవేత్తలకు అనుకూలం గానే వుంటాయి. నెల్లూరుజిల్లాకు ఉన్న అవకాశాలు రాష్ట్రంలో మరే జిల్లాకు లేవు. కాబట్టి ప్రత్యేకహోదా అంటూ వస్తే నెల్లూరుజిల్లా పారిశ్రామిక ప్రగతిలో వేగం పెరగడం ఖాయం.

# అసెంబ్లీలో నెల్లూరు నేతల వాయిస్



ప్రస్తుతం జరుగుతున్న శాసనసభ సమావేశాలలో నెల్లూరుజిల్లా ఎమ్మెల్యేలు సమస్యలపై తమ గళం విప్పుతున్నారు. సమస్యలపై మాట్లాడడంలో వైకాపా ఎమ్మెల్యేలే ముందుండడం విశేషం. నెల్లూరులో రైల్వేట్రాక్ పక్కన వేలాది కుటుంబాలను ఖాళీ చేయిస్తున్నారని, వారందరినీ ఆదుకోవాలంటూ నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సీఎంకు విన్నవించుకున్నారు. నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ అగ్రిగోల్డ్ బాధితులను ఆదుకోవాలంటూ జీరోఅవర్‌లో మాట్లాడారు. అగ్రిగోల్డ్ బాధితులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు బాకీలు చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మున్సిపల్ మంత్రి పి.నారాయణ వ్యవహారశైలిపై అసెంబ్లీలో ధ్వజమెత్తారు. తనకు కనీస సమాచారం లేకుండా మంత్రి కావలి నియోజకవర్గంలో దొంగచాటుగా పర్యటిస్తున్నారని, ఆయనకు అంత ఖర్మ ఎందుకని, ఎమ్మెల్యేలకు చెప్పి దర్జాగా రావొచ్చన్నారు. తన నియోజకవర్గంలోని సమస్యలను ఎమ్మెల్యే సభ దృష్టికి తీసుకొచ్చారు.




# కృష్ణాష్టమి వేడుకలకు వేమిరెడ్డి సహకారం

నెల్లూరు, గొలగమూడిరోడ్డులోని ఇస్కాన్ మందిరంలో ఈ నెల 5, 6 తేదీలలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం కోసం, వచ్చిన భక్తులందరికీ సౌకర్యాలు, ప్రసాదాలు అందజేయడం కోసం దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి 2లక్షల రూపాయలను ఇస్కాన్ ప్రతినిధి డాక్టర్ సుఖదేవ స్వామికి అందజేశారు. ఇస్కాన్ వాళ్లు చేసే ప్రతి కార్యక్రమానికి వేమిరెడ్డి తన తోడ్పాటునందిస్తుండడం అభినందనీయం.

# పనులు చేయకుండా పన్నులా?



నెల్లూరురూరల్ 12వ డివిజన్ పరిధిలోని వావిలేటిపాడు ముస్లిం పాలెంలో 8.2లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సి.సి.డ్రైన్ పనులను, 2లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సి.సి.రోడ్డు పనులను ఆ డివిజన్ కార్పొరేటర్ ఆనం రంగమయూర్‌రెడ్డి ఈ నెల 3వ తేదీన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు చేయకుండా రూరల్ ప్రాంతాలలో పన్నులు పెంచుతామంటే ఒప్పుకునేది లేదన్నారు. నగరాభివృద్ధికి నిధులు వస్తే మొదట విలీన పంచాయితీలలోనే ఖర్చు పెట్టాలని ఆయన కోరారు.




Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com